



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]
**అమ్మబడును**




కె. అబెడ్నేగో(రాజ బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243
RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 161 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 04 మార్చి 2026 | పేజీలు : 12 | వెల : 2/-




### మనుషులకీ, వన్యప్రాణులకు మధ్య

## సంఘర్షణ నివారణకు

# 'హనుమాన్'



- అటు వన్యప్రాణులు, ఇటు ప్రజల ప్రాణాలు, ఆస్తుల సంరక్షణ హనుమాన్ ఫౌండేషన్ ప్రధాన కర్తవ్యం
- అటవీ సరిహద్దు గ్రామాల ప్రజల రక్షణ, జీవనోపాధి కల్పనకు చర్యలు
- కట్టుదిట్టంగా వన్యప్రాణి సంరక్షణ చర్యలు • విజయవంతంగా కుంకీ ఆపరేషన్స్
- హనుమాన్ ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్

**విశ్వం వాయిస్ న్యూస్ :** 'వసుధైక కుటుంబం అనే ఉన్నతమైన సిద్ధాంతాన్ని బలంగా నమ్మే దేశం మనది. సమస్త జీవకోటి, వన్యప్రాణులు ఇందులో అంతర్భాగం. మానవ మనుగడకు ప్రకృతి సమతుల్యత, వన్యప్రాణుల సంరక్షణ అత్యంత ముఖ్యం. దీనిని దృష్టిలో పెట్టుకొనే అటవీ శాఖ ఆధ్వర్యంలో హనుమాన్ ప్రాజెక్ట్ (హీలింగ్ అండ్ నర్చ్యూరింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్, ఎయిడ్ అండ్ నర్సింగ్ ఆఫ్ వైల్డ్ లైఫ్) ముందుకు తీసుకొచ్చామ'ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో వన్య ప్రాణుల వల్ల పంట, పశు సంపదకి నష్టంతోపాటు మావన భద్రతకు ముప్పు కలిగించే సంఘటనలు పెరుగుతున్నందున ఈ నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్ లో మంగళవారం ఉదయం హనుమాన్ పేరుతో 100 ప్రత్యేక ర్యాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ వాహనాలను శ్రీ పవన్ కళ్యాణ్ గారు అ ప్రారంభించారు. వీటిలో వన్య ప్రాణుల సంరక్షణతోపాటు వాటికి అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు అంబులెన్స్, రెస్క్యూ వాహనాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఇంఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "హనుమాన్ ప్రాజెక్ట్ మానవ-వన్యప్రాణి మధ్య ఉన్న సంఘర్షణను నివారించడం, తగ్గించడం కోసం రూపకల్పన చేసిన మిగతా .. 2లో..

### ఇంద్రకీలాద్రి కుంభాభిషేకానికి

# ముఖ్యమంత్రికి ఆహ్వానం

**6 నుంచి 8 వరకు మహోత్సవాలు - ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందజేత**
**అమ్మవారి చిత్రపటం, ప్రసాదం సమర్పణ**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న కుంభాభిషేక మహోత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆహ్వానించారు. పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్ కలిసి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. దేవస్థానం తరఫున అమ్మవారి చిత్రపటాన్ని మిగతా .. 2లో..


## రుషికొండ బీచ్ రోడ్డులో ప్రైవేటు బస్సు దగ్ధం



**పీఎం పాలెం (విశాఖ), విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని రుషికొండ బీచ్ రోడ్డులో మంగళవారం ఉదయం భారీ ప్రమాదం తప్పింది. ఓ ప్రైవేటు బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. నగరంలోని గవర్నర్ బంగ్లా ప్రాంతం నుంచి భీమిలిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు వెళ్లేందుకు ఉదయం 6 గంటల సమయంలో బస్సు బయలుదేరింది. రుషికొండ మిగతా .. 2లో..

### సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసి..

## క్రికెట్ బెట్టింగ్ యాప్ నిర్వహించి..



**నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ క్రికెట్ బెట్టింగ్ రాకెట్‌ను నెల్లూరు సిటీ పోలీసులు ఛేదించారు. ఆర్777 అనే క్రికెట్ బెట్టింగ్ యాప్ నిర్వాహకులను అరెస్టు చేశారు. ఇద్దరు బుకీలు మహేశ్‌బాబు, హరికృష్ణను అరెస్టు చేసినట్లు బాలాజీ నగర్ పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు బుకీలు మహేశ్‌కుమార్, మణికుమార్ గురించి గాలిస్తున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి 4 ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. మాయమాటలు చెప్పి రూ.53 లక్షలు పెట్టుబడి పెట్టించి మోసం చేసినట్లు మిగతా .. 2లో..

### అవయవ దానంలో

# రాష్ట్రానికి ఆరో స్థానం

**కేంద్ర ప్రభుత్వం వెల్లడి - రాష్ట్రంలో గడిచిన 2 నెలల్లో 64 మందికి కొత్త జీవితం**
**గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది పెరుగుతున్న స్పందన - నిరీక్షించే 5000 మందిలో 50 ఏళ్ల లోపు ఉన్న వారే అత్యధికం**
**ప్రభుత్వాసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు పెరగాలి**
**హైకోర్టు తీర్పు నేపథ్యంలో జీవన్ ధాన్ కార్యకలాపాలపై సమీక్షించిన మంత్రి సత్య కుమార్ యాదవ్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అవయవాల దానశీలో భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆరో స్థానంలో నిలిచిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ ( కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అపెక్స్ బాడీ) రాష్ట్రాల వారీగా అవయవ దానశీ జాబితా-2025ను ప్రకటించిందని మంత్రి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత 2015లో ఏర్పాటు అయిన జీవన్ దాన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తుందన్నారు.

**పురోగతి కనిపించాలి**

ఇటీవల హైకోర్టు ప్రభుత్వాసుపత్రుల్లో మిగతా .. 2లో..

### ఘనంగా లోకసభ మాజీ స్పీకర్

# జీఎంసీ బాలయోగి వర్ధంతి

**ఘాట్‌లో నివాళులర్పించిన పలువురు నేతలు - ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ అభివృద్ధి పథంలో నడిపించిన లోకసభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి 24వ వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి పట్టణమలోని నల్లవంతెన సమీపంలోని బాలయోగి ఘాట్‌లో ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఎంపీ హరీష్ బాలయోగి నివాసంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమం ముగించుకున్న అనంతరం నివాసం వద్ద నుండి ఎంపీ హరీష్ ర్యాలీగా ఘాట్ కు చేరుకున్నారు. ఘాట్‌లోని బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీఎంసీ బాలయోగి వర్ధంతిని పురస్కరించుకుని అమలాపురంలోని బాలయోగి ఘాట్‌లో పలువురు నేతలు మాట్లాడుతూ బాలయోగి దేశానికి, కోనసీమకు చేసిన సేవలను గుర్తుచేశారు. ఘాట్‌లో నివాళులర్పించిన వారిలో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మిగతా .. 2లో..

### 'మార్చురీలో మృతదేహాన్ని

## పీక్కుతిన్న కుక్క'..

### ముగ్గురిపై సస్పెన్షన్ వేటు

**జడ్చర్ల పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో వ్యక్తి మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ సహా ముగ్గురిని సస్పెండ్ చేసింది. డ్యూటీ డాక్టర్ మునిశాకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 'మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్క' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన కథనంపై ప్రభుత్వం స్పందించి ఈ మేరకు చర్యలు తీసుకుంది. జడ్చర్లలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిని మంగళ వారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై ఆయన విచారణ చేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంవో హరినాథ్, డ్యూటీ డాక్టర్ మునీషా, ఎంఎన్‌ఓ రవిప్రకాష్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.

### ఒమన్, కువైట్, ఖతార్

## దేశాధినేతలకు ప్రధాని మోదీ ఫోన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇజ్రాయెల్, అమెరికా దాడులు.. ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు భారత్‌కు చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ పరిణామాల నడుమ ఒమన్, కువైట్, ఖతార్ పాలకులతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఆయా దేశాలపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. "ఒమన్ సుల్తాన్ హైథమ్ బిన్ తారిఖ్, కువైట్ యువరాజు సభా అల్-ఖాలీద్ అల్-సభా, ఖతార్ ఎమిర్ తమీమ్ బిన్ హామద్ అల్ థానీలతో ప్రధాని మోదీ ఫోన్‌లో వేర్వేరుగా మాట్లాడారు. ఈ దేశాలపై దాడులను ఖండించారు. అక్కడి భారతీయుల క్షేమ సమాచారం గురించి మిగతా .. 2లో..

### చర్చిద్దామన్నారు..

## కానీ ఆలస్యమైందని చెప్పాను : ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలకు సిద్ధమని ఇరాన్ నేతలు చెప్పారని.. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని చెప్పినట్టు పేర్కొన్నారు. ఇరాన్ నాయకత్వంతోపాటు ఆ దేశ గగనతల రక్షణ, వాయుసేన, నౌకాదళ వ్యవస్థలన్నీ తుడిచిపెట్టుకుపోయినట్టు తెలిపారు. ఈ మేరకు సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన ఓ కథనాన్ని ట్రంప్ ఖండించారు. ఆ పత్రిక అభిప్రాయంతో ఏకీభవించడం లేదన్నారు. అమెరికా ఆయుధ నిల్వలు తక్కువగా ఉన్నాయని, మిగతా .. 2లో..

### అంగన్వాడీల సంక్షేమానికి

## ప్రభుత్వం కట్టుబడి ఉంది



**పాలకొల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో పర్యటించిన ఆయన.. రూ.5.80 కోట్లతో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీల 9 డిమాండ్లను కూటమి ప్రభుత్వం ఇప్పటికే నెరవేర్చిందన్నారు. అంగన్వాడీలకు 2 సార్లు మిగతా .. 2లో..

### ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో

# అనుసంధానం చేయాలి

**తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయంలో కలెక్టర్లతో సీఎం సమావేశమయ్యారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. 99 రోజుల కార్యాచరణలో అందరి భాగస్వామ్యం ఉండాలని సీఎం పిలుపునిచ్చారు. " గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి. విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం మిగతా .. 2లో..

## టెహ్రాన్‌పై దాడులు..

**భారతీయ విద్యార్థులు సురక్షిత ప్రాంతాలకు తరలింపు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ పెద్దఎత్తున దాడులు చేస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అక్కడున్న భారతీయ విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కీలక చర్యలు తీసుకుంది. అనేక మంది మిగతా .. 2లో..

### ఇరాన్ అధ్యక్ష కార్యాలయంపై

## దాడి చేశాం : ఐడీఎఫ్

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌పై ఇజ్రాయెల్ తన దాడులను తీవ్రతరం చేసింది. ఈ క్రమంలోనే ఇరాన్ అధ్యక్ష కార్యాలయంపై దాడి చేసినట్లు ప్రకటించింది. "కచ్చితమైన నిఘా సమాచారం ఆధారంగా.. టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న కీలక ప్రాంగణంపై దాడులు చేశాం. అధ్యక్ష కార్యాలయం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ భవనంపై అనేక బాంబులు జారవిడిచాం. అదేవిధంగా ఇరాన్ సైనికాధికారులకు శిక్షణ ఇచ్చే సంస్థను, ఇతర మౌలిక సదుపాయాలను మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# సంఘర్షణ నివారణకు 'హనుమాన్'





సమగ్ర సాంకేతిక, శాస్త్రీయ కార్యక్రమం. ఈ ప్రాజెక్టు ద్వారా అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు రక్షణ, వారి జీవనోపాధికి భద్రత కల్పించడం, వన్యప్రాణుల సంరక్షణ చర్యలు మరింత కట్టుదిట్టంగా ముందుకు తీసుకువెళ్లబోతున్నాం. వన్యప్రాణులను సంరక్షిస్తూనే పంటలు, పశువులు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల సంరక్షణ చేపట్టేలా హనుమాన్ ప్రధాన కర్తవ్యం. ఏదైనా సంఘటన చోటు చేసుకున్నప్పుడు తక్షణ ప్రతిస్పందన, ఉపశమన చర్యలు, పరిహారం చెల్లింపు వ్యవస్థల్ని హనుమాన్ ఫౌండేషన్ నిర్వర్తిస్తుంది. పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, పోలీస్ శాఖలతోపాటు ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ అటవీశాఖ హనుమాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్తుంది.

### గ్రామ స్థాయిలో 'వజ్ర' బృందాలను సిద్ధం చేస్తున్నాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా తీసుకొచ్చిన ఈ హనుమాన్ ప్రాజెక్ట్ కోసం పూర్తి సాంకేతికతతో కూడిన 100 వాహనాలను ప్రారంభించాం. అందులో 93 ర్యాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ వాహనాలు కాగా, మరో 7 వాహనాలు వన్యప్రాణుల సంరక్షణతో పాటు వాటికి అవసరమైన వైద్య సహాయాన్ని అందించేందుకు అవసరమైన అంబులెన్స్ లు ఉన్నాయి. వీటికి అనుసంధానంగా విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, బైర్లుటిల్లో నాలుగు వైల్డ్ లైఫ్ రెస్క్యూ అండ్ ట్రీట్మెంట్ సెంటర్లు, 19 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా ఉంచాం. ప్రతి వాహనంలో అటవీ రేంజ్ ఆఫీసర్, జంతు వైద్య సిబ్బంది, ట్రైబల్ హెల్పర్స్ (గిరిజన), పారా వెటరేనియన్స్ తో కూడిన పూర్తి స్థాయి వ్యవస్థ ఉంటుంది. గ్రామ స్థాయిలో వన్య జీవి రక్షక్ (వజ్ర)లను అటవీ శాఖ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నాం. వీరికి రెస్క్యూ కిట్లు అందిస్తున్నాం. గ్రామ స్థాయిలో పాములు, ఇతర జంతువుల నుంచి ఎదురయ్యే సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించే విధంగా వారికి శిక్షణ ఇచ్చాం.

### పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాం

కూటిమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మానవ- వన్యప్రాణి సంఘర్షణలో జరిగిన నష్టానికి ఎప్పటికప్పుడు పరిహారం కూడా చెల్లించేస్తున్నాం. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో ఈ తరహా కేసులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,107 వరకు నమోదు కాగా పరిహారం కింద దాదాపు రూ. 4 కోట్లు చెల్లించాం. ఇది బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అందించిన భరోసా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వన్యప్రాణుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఇచ్చే ఎక్స్ గ్రేషియా, నష్టపోయిన పంటలకు ఇచ్చే నష్టపరిహారం మొత్తాన్ని గణనీయంగా పెంచాం. జంతువుల దాడిలో మనిషి చనిపోతే ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. గాయపడిన వారికి ఇచ్చే పరిహారం రూ.2 లక్షలు చేశాం. పశువులు చనిపోతే మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లిస్తున్నాం. చిత్తూరు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల సమస్య తీవ్రంగా ఉంది. ఈ సమస్య పరిష్కారానికి కర్ణాటక ప్రభుత్వ సహకారంతో నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ఇప్పటి వరకు 8 ఆపరేషన్స్ విజయవంతంగా పూర్తి చేసి ఏనుగుల బారి నుంచి ప్రజలకు, పంటలకు రక్షణ కల్పించాం.

### ఏఐ సహాయంతో వన్యప్రాణుల కదలికలు

వన్యప్రాణుల కదలికలను పర్యవేక్షించడానికి ఏఐ టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం. దీనిని పైలెట్ ప్రాజెక్ట్ గా ప్రారంభించాం. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో జంతువుల వచ్చే ముందు ముందస్తు హెచ్చరికలు ఇచ్చే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నాం. వన్యప్రాణుల వల్ల మానవ భద్రతకు ముప్పు కలగకుండా వశుధైక కుటుంబంలా కలిసి బతికే లక్ష్యంతో హనుమాన్ ప్రాజెక్ట్ ను తీసుకొచ్చాం. ఈ ప్రాజెక్ట్ కోసం అటవీశాఖ అధికారులు, ఫ్రంట్ లైన్ సిబ్బంది ఎంతో అంకితభావంతో కష్టపడి పని చేశారు. వారందరి సేవలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. అలాగే వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటి, ఈస్టర్న్ ఘాట్స్ కన్జర్వేషన్ సోసైటీ వంటి నిబద్ధతతో పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు కూడా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. కలిసి జీవిద్దాం. కలిసి అభివృద్ధి చెందుదాం" అని అన్నారు.

### 100కు పైగా హనుమాన్ వాహనాలకు ప్రారంభోత్సవం

పూర్తి అధునాతన సాంకేతికతతో రూపొందించిన 100కు పైగా హనుమాన్ వాహనాలను పవన్ కళ్యాణ జెండా ఊపి ప్రారంభించారు. అందులో 19 ర్యాపిడ్ రిలీఫ్ రెస్పాన్స్ వాహనాలు ఉన్నాయి. వన్యప్రాణులు గాయపడిన సందర్భాల్లో వాటిని తరలించేందుకు వీలుగా పూర్తి స్థాయి సౌకర్యాలతో వీటిని సిద్ధం చేశారు. వీటితోపాటు స్పాట్ లో చికిత్స అందించేందుకు వీలుగా ఆంబులెన్స్‌లు, కాంపా వాహనాలు ఉన్నాయి. హనుమాన్ డిజిటల్ యాప్, అధునాతన సాంకేతికతతో అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన జి.పి.ఎస్. ట్రాకింగ్ సిస్టంను ప్రారంభించారు. అంతకు ముందు అటవీశాఖకు సంబంధించి వివిధ విభాగాల్లో అత్యుత్తమ పనితీరు కనబర్చిన సిబ్బంది, సేవలు అందిస్తున్న ఎన్జీవోలకు పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. హనుమాన్ ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలను పవన్ కళ్యాణ్ ఆసక్తిగా తిలకించారు. మొదట ర్యాపిడ్ రిలీఫ్ రెస్పాన్స్ వాహనాలు, హనుమాన్ ఆంబులెన్స్ లను పరిశీలించి సౌకర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ పరిధిలో సంచరించే వన్యప్రాణులు వివరాలు, సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, రెస్క్యూ ఆపరేషన్స్ లో వినియోగించే కిట్లు, జనావాసాల్లోకి వచ్చిన పులులు లాంటి వన్య మృగాలను బంధించే బోన్లు, అటవీశాఖ పరిధిలో పెరిగే ఔషదాల మొక్కలు, ఉత్పత్తుల వివరాలను అధికారులు, ఎన్జీవోలు గ్యాలరీల రూపంలో పవన్ కళ్యాణ్‌కి వివరించారు. ఈస్ట్రన్ ఘాట్స్‌లో సంచరించే కింగ్ కోబ్రా తదితర పాముల వివరాలు తెలియజేస్తూ ఇచ్చిన ప్రజంటేషన్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు పి.మల్లికార్జునరావు, అటవీశాఖ ఐటీ సలహాదారు పి.నాగేశ్వరరావు, అటవీశాఖ సలహాదారు అంకారావు, రాష్ట్ర మెడికల్ డెవలప్మెంట్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చిల్లపల్లి శ్రీనివాసరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే, గుంటూరు జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియా, 6వ బెటాలియన్ కమాండెంట్ నగేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రి కుంభాభిషేకానికి

# ముఖ్యమంత్రికి ఆహ్వానం

సమర్పించి, ప్రసాదాన్ని అందించారు. మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కుంభాభిషేక మహోత్సవాలు మూడు రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తుల రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి ఆశీర్వచనం అందించారు. మహోత్సవాలు విజయవంతంగా సాగాలని, రాష్ట్ర ప్రజలందరికీ శ్రేయస్సు కలగాలని ప్రార్థించారు.

# రుషికొండ బీచ్ రోడ్డులో ప్రైవేటు బస్సు దగ్ధం

సమీపంలోకి రాగానే ఇంజిన్ భాగం నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ రాజేష్, వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కకు నిలిపి కిందకు దిగిపోయారు. చూస్తుండగానే మంటలు బస్సు మొత్తానికి వ్యాపించాయి. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నారు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ఘటనపై పీఎం పాలెం పోలీసులు విచారణ చేపట్టారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసి..

## క్రికెట్ బెట్టింగ్ యాప్ నిర్వహించి..

ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టిన నెల్లూరు సిటీ పోలీసులు.. నిందితుల బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.1.64 కోట్ల నగదును సీజ్ చేశారు. గతంలో పొడపాటి మహేశ్‌బాబు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేశాడు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో.. బెట్టింగ్ యాప్‌ను ఎంచుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. శ్రీలంక, దుబాయ్ తిరిగి బెట్టింగ్ యాప్ నిర్వహణపై మహేశ్ శిక్షణ పొందినట్లు తెలిపారు. ఆర్777 యాప్‌ను 30శాతం షేర్ వచ్చేలా దుబాయ్ నుంచి తీసుకున్నాడు. మణి, వేణు, మహేశ్‌కుమార్‌కు 15 శాతం షేర్ ఇస్తూ వారితో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించాడు.

అవయవ దానంలో

# రాష్ట్రానికి ఆరో స్థానం

అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సల గురించి ఆదేశాలు వెలువరించిన నేపథ్యంలో మంత్రి శ్రీ సత్య కుమార్ వైద్య ఆరోగ్య, జీవన్ దాన్ ట్రస్ట్ అధికారులతో సమీక్ష జరిపారు. అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగే ఆసుపత్రుల సంఖ్య మూడు నుంచి తొమ్మిదికి పెరిగిందన్నారు ఈ జాబితాలో వైజాగ్ కేజీహెచ్, విమ్స్, గుంటూరు జి జి హెచ్, కర్నూలు జిజిహెచ్, తిరుపతి స్విమ్స్, మంగళగిరి ఎయిమ్స్, పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్- తిరుపతి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పలాస, జి జి హెచ్ విజయవాడ ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. అలాగే కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, ఒంగోలు, అనంతపురం, వైయస్సార్ కడప,తిరుపతి ఆసుపత్రుల్లో బ్రెయిన్ డెడ్ కేసుల నుంచి అవయవాల తొలగింపు, ఇతర ఆసుపత్రులకు తరలించేందుకు అవసరమైన అనుమతులు ఇచ్చామని జీవన ట్రస్ట్ కోఆర్డినేటర్ రాంబాబు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు పెరిగేలా చూడాలని, పురోగతి కనిపించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు.. విశాఖలోని కేజీహెచ్, విమ్స్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, కర్నూలు ప్రభుత్వాసుపత్రి ద్వారా ఇప్పటి వరకు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు నుంచి ఎనిమిది కిడ్నీలు, ఒక లివర్ మార్పిడి చేయగా రక్తసంబంధుకుల నుంచి 87 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసినట్లు అధికారులు వివరించారు. తాజాగా విజయవాడ శివారులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండెను స్వీకరించి గుండె మార్పిడి విజయవంతంగా పూర్తి చేశారు.

### పెరుగుతున్న ఔదార్యం

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది రెండు నెలల కాలంలో 18 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 64 అవయవాలు స్వీకరించి 64 మంది జీవితాల్లో వెలుగులు నింపారు.. ఇది గడిచిన రెండు సంవత్సరాలతో పోల్చుకుంటే గణనీయంగా అవయవ దాన కేసులు పెరుగుతున్నాయి అనటానికి నిదర్శనం అన్నారు. గత ఏడాది మొదటి రెండు నెలల్లో 12 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 31 అవయవ దాన మార్పిడి జరిగితే, 2024 లో 10 మంది బ్రెయిన్ డెడ్ వ్యక్తులు నుంచి సహకరించిన 30 అవయవాల మార్పిడి జరిగాయన్నారు. ఈ ఏడాది మరింతగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలు స్వీకరించి అవయవాలు కోసం ఎదురుచూస్తున్న బాధితులకు భరోసా కల్పించేందుకు కృషి చెయ్యాలని జీవన్ దాన్ సమన్వయకర్తలకు, స్వచ్ఛంద సేవా సంస్థలకు మంత్రి సూచించారు.

### 1,200 మంది బాధితులకు నూతన జీవితాలు...

రాష్ట్రంలో అవయవాలు ఆయుష్షు నిండి ఎదురుచూస్తున్న 1200 మంది బాధితులకు రాష్ట్ర జీవన్ దాన్ నూతన జీవితాలను ప్రసాదించిందని బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించి బాధితులకు అండగా నిలుస్తూ వారి జీవితాలకు కొత్త వెలుగులు నింపిందన్నారు. గత ఏడాది కాలంలోనే 301 మంది బాధితులకు నూతన జీవితాలను ప్రసాదించి సరికొత్త చరిత్రను రాష్ట్ర జీవన్ దాన్ సృష్టించింది అని పేర్కొన్నారు..

### అవయవాల కోసం 5,000 మంది ఎదురుచూపులు

రాష్ట్రంలో 20-50 ఏళ్ల వయసు మధ్యలో ఎక్కువ మంది అవయవాలు విఫలమై బాధపడుతున్నట్లు రాష్ట్ర జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా తెలిసిందన్నారు. ట్రస్టులో ఇప్పటి వరకు 5347 మంది పలు అవయవాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారిలో అధికంగా యువకులే ఉండటం గమనార్హం. ఉత్పాదక వయసులోనే అవయవ వైఫల్యంతో చిక్కిశల్యమవుతుండటంతో వారి వ్యక్తిగత జీవితంలోనే గాక సామాజికంగానూ తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 0-09 ఏళ్లలోపు పిల్లలు 38 మంది ఉన్నారని మంత్రి శ్రీ సత్యకుమార్ తెలిపారు.

### కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించే విధంగా వాళ్లకి గౌరవం కల్పించేడానికి జారీ చేసిన జీవో 95 ద్వారా అవయవ దానం చేసిన వ్యక్తికి ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కరణలు జరుగుతున్నాయి. అలాగే 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆర్థిక సాయం రూ. లక్ష వరకు పెంచే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు.

ఘనంగా లోకసభ మాజీ స్పీకర్

# జీఎంసీ బాలయోగి వర్ధంతి



పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, ప్రధాన కార్యదర్శి గంధం పల్లం రాజు, కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, రాజోలు టీడీపీ ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య, మాజీ ఎమ్మెల్యేలు చెల్లి వివేకానంద, చిల్లా జగదీశ్వరి, అయ్యాజీ వేమా, అల్లాడ సోంబాబు, మార్కెట్ కమిటీ చైర్మెన్ లు చిట్టూరి శ్రీవాస్, కేతా లక్ష్మి, చిక్కాల గణేష్, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మట్టపర్తి భారతి, భాజపా జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, నల్లా పవన్, కల్వకోలను తాతాజీ, ఏడిద శ్రీను, మోకా సుబ్బారావు తదితరులు ఉన్నారు.

### ఉచిత మెగా వైద్య శిబిరం

రాజమండ్రి కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ వారిచే ఎంపీ హరీష్ బాలయోగి మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు. సుమారు 600 వందల మంది వరకూ ప్రముఖ వైద్య నిపుణులచే గుండె మరియు నరాల సమస్యలు, ఎముకలు మరియు మోకాళ్ల నొప్పులు, శ్వాస సంబంధిత సమస్యలు, మహిళల ఆరోగ్య సమస్యలు, కంటి పరీక్షలు, పిల్లల ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జుజుసూ, జుజు+, ద్రూ మరియు షుగర్ వంటి పరీక్షలు అక్కడే చేశారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

ఒమన్, కువైట్, ఖతార్

# దేశాధినేతలకు ప్రధాని మోదీ ఫోన్

ఆరా తీశారు. వారి భద్రత గురించి చర్చించారు. దౌత్యమార్గాలు, చర్చల ద్వారా ప్రాంతీయ శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించాలని నేతలంతా ఏకాభిప్రాయానికి వచ్చారు" అని అధికార వర్గాలు తెలిపాయి. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట పశ్చిమాసియాలోని దేశాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. ప్రధాని మోదీ ఇప్పటికే బహ్రెయిన్, సౌదీ అరేబియా, జోర్డాన్, యూఏఈ తదితర దేశాల అధినేతలతో మాట్లాడారు. పశ్చిమాసియాలో దాదాపు 90 లక్షలమంది భారతీయులు నివసిస్తున్నారు. ఇజ్రాయెల్‌లో 40 వేలమంది, ఇరాన్‌లో 10 వేలమంది ఉన్నారు.

చర్చిద్దామన్నారు..

# కానీ ఆలస్యమైందని చెప్పాను : ట్రంప్

ఎక్కువ కాలం యుద్ధం కొనసాగితే అవి నిండుకునే ప్రమాదం ఉందన్న వార్తలను అధ్యక్షుడు తోసిపుచ్చారు. మధ్యస్థ, ఉన్నతస్థాయి ఆయుధాలు అపరిమిత సంఖ్యలో ఉన్నాయని, అవి చాలా శక్తిమంతమైనవన్నారు.

అంగన్వాడీల సంక్షేమానికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

వేతనాలు పెంచిన ఘనత చంద్రబాబుదని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వం రూ.1000 మాత్రమే పెంచి వారిని మోసం చేసిందని విమర్శించారు.

ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో

# అనుసంధానం చేయాలి

చేయాలి. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతినెలా బిల్లులు చెల్లించాలి" అని సీఎం అన్నారు. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు.

# టెహ్రాన్‌పై దాడులు..

విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించింది. ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "టెహ్రాన్‌పై దాడులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో.. నగరంలోని అనేక మంది భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రదేశాలకు తరలించాం. విద్యార్థుల రవాణా, ఆహారం, వసతి ఏర్పాట్లను చూసుకున్నాం. ఎంబసీ సాయాన్ని నిరాకరించిన కొంతమంది మాత్రమే ప్రస్తుతం టెహ్రాన్‌లో ఉన్నారు. ఇంకా ఇరాన్‌లోనే ఉన్న భారతీయ విద్యార్థులు, పౌరులు.. ఇదివరకే జారీ చేసిన సలహాలు పాటించాలి. ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే ఇళ్లకే పరిమితం కావాలి. వీలైనంత వరకు కిటికీలకు దూరంగా ఉండండి. ఎల్లవేళలా అప్రమత్తంగా వ్యవహరించండి. నిరసనలు, ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లొద్దు. భారత రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండండి" అని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

ఇరాన్ అధ్యక్ష కార్యాలయంపై

# దాడి చేశాం : ఐడీఎఫ్

లక్ష్యంగా చేసుకున్నాం" అని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ తెలిపింది. మరోవైపు.. యుద్ధంపై ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ నాదవ్ శోషాని కీలక వ్యాఖ్యలు చేశారు. దాడులు అనేక వారాల పాటు కొనసాగవచ్చనే అంచనాతో తమ సైన్యం సిద్ధమైందని చెప్పారు. అయితే, యుద్ధం ఎంత కాలం కొనసాగుతుందనేది పరిస్థితులపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పటివరకు యుద్ధంలో సానుకూల పురోగతి సాధించామని ఓ మీడియా సమావేశంలో తెలిపారు. ఇరాన్‌లో భూతల దాడుల కోసం బలగాలను మోహరించే అవకాశం ఉందా? అనే ప్రశ్నపై స్పందిస్తూ.. అలాంటిదేమీ లేదని చెప్పారు. ఇప్పటికైతే అటువంటి ఆలోచనలు లేవన్నారు.

# ఎడిటర్ వాయిస్

## లోకేష్ సీఎం.. ఈ ప్రచారం నిజమేనా?

ఏపీలో ఒక ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగుతోంది. అది రాజకీయ ప్రచారం పైగా అధికార కూటమికి సంబంధించిన ప్రచారం. అతి ముఖ్యమైన కీలకమైన సున్నితమైన అంశానికి సంబంధించి సాగుతున్న ప్రచారం. మరి ఈ ప్రచారాన్ని కూటమిలో ఎవరు ఎంత వరకు సీరియస్ గా తీసుకుంటున్నారు అన్నది అయితే తెలియదు కానీ సోషల్ మీడియాలో అయితే పెద్ద ఎత్తున సాగుతోంది. కొన్ని చానల్స్ కూడా దీని మీద ఇప్పటికే స్టోరీలను వండి వారుస్తున్నాయి. డేట్ టైం ఫిక్స్ చేసేసాయి. అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్లుగా రకరకాలైన పోస్టులతో సోషల్ మీడియాలో ఈ అంశం మీదనే డిబేట్స్ పెడుతున్న వారూ ఉన్నారు.

**అసలేమి జరుగుతోంది :** ఇదిలా ఉంటే ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అచ్చంగా ఇరవై నెలలు మాత్రమే అయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు వంటి అనుభవశాలి నాయకత్వంలో ప్రభుత్వం సజావుగా సాగుతోంది. ఏపీలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. విభజన తరువాత వారసత్వంగా వచ్చిన సమస్యలు అధికంగా ఉన్నాయి. అలాగే ఆర్థికంగా పెను సవాళ్ళు ఉన్నాయి. రాజధాని నిర్మాణం అతి పెద్ద టాస్క్. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం మరో టార్గెట్. ఇలా అనేక రకాలుగా ఏపీ ముందుకు సాగాల్సి ఉంది. ఈ సమయంలో కూటమిలో నాయకత్వం మార్పిడి ఉంటుందా అది జరిగే పనేనా అన్నది ఒక సీరియస్ క్వశ్చన్ గా ముందుకు వస్తోంది.

**మంచి ముహూర్తంగా :** అయితే ప్రచారం మాత్రం ఎక్కడా ఆగడం లేదు, ఉగాది వేళ ఏపీలో నాయకత్వం మార్పు ఉంటుందని లోకేష్ కి సీఎం గా బాధ్యతలు అప్పగిస్తారు అని చంద్రబాబు పార్టీ రాజకీయాలు చూసుకుంటారు అని ప్రచారం చేస్తున్నారు అవసరం అయితే ఆయన కేంద్ర రాజకీయాలకు వెళ్తారు అని కూడా చెబుతున్నారు. ఇక ఏపీలో మిత్ర పక్షాలు జనసేన బీజేపీ కూడా ఈ నాయకత్వం మార్పిడికి అంగీకరిస్తారా అంటే దాని మీద ఎవరికి తోచిన తీరులో కథనాలు వండుతున్నారు. జనసేన కూటమికి దూరం అవుతుందని అలాగే బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుందని కూడా కథనాలు ముందుకు వస్తున్నాయి. మరి ఏమిటి ఇదంతా అసలు ఏపీలో ఇలాంటి వాతావరణం ఉందా కూటమిలో ఆ మాదిరిగా సంకేతాలు అయినా కనిపిస్తున్నాయా అంటే మ్యాటర్ అయితే కేవలం సోషల్ మీడియాలోనే నలుగుతోంది తప్ప ఎక్కడా చడీ చప్పుడు కూడా లేదనే అంటున్నారు.

**ప్రత్యర్థుల ఎత్తుగడగా :** దీని మీద సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వం తరఫున సమర్ధించే వారు అభిమానులు టీడీపీని బలపరచే రాజకీయ విశ్లేషకులు చెబుతున్నది ఏమిటి అంటే ఇదంతా ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారం మాత్రమే అని. కూటమిలో ఎలాగైనా చీలిక తీసుకుని రావడానికి చూస్తున్నారు అని అంటున్నారు. ఏపీలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం బాగా ముందుకు సాగుతోందని దానిని దెబ్బ తీసేందుకే ఈ తరహా ప్రచారాన్ని కొందరు నమ్ముకున్నారని అంటున్నారు. మరి అది నిజమా లేక నిజంగానే కూటమిలో అలాంటి అభిప్రాయం ఉందా అంటే తెలియదనే అంటున్నారు. లోకేష్ మాత్రం మంత్రిగా తనదైన శైలిలో పనిచేసుకుంటూ పోతున్నారు. టీడీపీకి ఆయనే ఏకైక వారసుడు. మరి వారసుడికి ముఖ్యమంత్రి పదవిని తొందరగా అందించే విషయంలో ఆ పార్టీకి ఇప్పటికిప్పుడు అంత ఆసక్తి ఉందా అన్నదే మరో చర్చ. ఏది ఏమైనా ఇది ఒక రాజకీయ మసాలాగా చూడాలా లేక ఏమైనా ఉందా అంటే కాలమే జవాబు చెప్పాలని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## కూలర్ల గోదాంలో పేలిన గ్యాస్ సిలిండర్లు.. భారీగా మంటలు



**కర్నూలు టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలు పట్టణంలోని బాలాజీ నగర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్యాస్ సిలిండర్లు పేలడంతో కూలర్ల గోదాంలో మంటలు చెలరేగాయి. భారీ సంఖ్యలో కూలర్లు తగలబడిపోతున్నాయి. ప్లాస్టిక్ సామగ్రి కావడంతో మంటలు వేగంగా విస్తరించాయి. భారీ పొగలు అలముకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు. అక్కడ పని చేసే సిబ్బంది వంట కోసం తీసుకొచ్చిన 2 గ్యాస్ సిలిండర్లు పేలినట్లు తెలుస్తోంది.

## ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం

### చర్యలు తీసుకోవాలని పోలీసులకు మహిళ ఫిర్యాదు

**రాయదుర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** తన ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఓ మహిళ రాయదుర్గం పోలీసులను ఆశ్రయించారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతానికి చెందిన ఓ మహిళ (52) ఆస్ట్రేలియా, కెనడాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు.. తన ఫొటోలు, వీడియోలను ఏఐ, డీప్ ఫేక్ సాంకేతికతతో అసభ్యంగా సృష్టించి వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్యలతో తన గౌరవానికి, ప్రతిష్ఠకు భంగం కలిగిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులను కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెట్టుకు ఉరివేసుకొని ప్రేమ జంట ఆత్మహత్య

**నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లా రాపూరుఘాట్ అడవుల్లో ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ముత్తుకూరుకు చెందిన ఆలపాక ప్రసన్న (25)కు సోషల్ మీడియా ద్వారా చిట్టమూరుకు చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. ఏమైందో ఏమో తెలియదుగానీ.. రాపూరు- చిట్వేల్ ఘాట్ రోడ్డులో ఓ చెట్టుకు ఉరేసుకొని ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. అదే ప్రదేశంలో పురుగుల మందు డబ్బా కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సదరు మహిళకు ఇది వరకే వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం.

## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

**బీబీనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా గొల్లెగూడెంలో దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య చేసుకుంది. 10 నెలల శిశువు, రెండేళ్ల కుమారుడిని తల్లి ఐశ్వర్య చంపేసింది. ఆ తర్వాత తాను కూడా బలవన్మరణానికి పాల్పడింది. ఆమె భర్త రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ఎద్దుల దాడిలో ముగ్గురి మృతి

**చెన్నై (ప్యారిస్), విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులో జరుగుతున్న మంజువిరట్టు పోటీ పలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పోటీలు జరుగుతుండగా ఎద్దులు పొడవడంతో ముగ్గురు మృతి చెందారు. శివగంగై జిల్లా సింగంపుణరి సమీపం అరళిప్పారైలోని బాల దండాయుధపాణి ఆలయ తిరునాళ్ల సందర్భంగా సోమవారం మంజువిరట్టు పోటీ నిర్వహించారు. ఇందులో 500 ఎద్దులు, 112 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీ జరుగుతుండగా ఎద్దులు ఒక్కసారిగా దాడి చేయడంతో సుమారు 75 మంది గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన రామనాథన్ (23), సుందరరాజ్ (48), ఐస్ విక్రయిస్తున్న రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి ఘటనా స్థలంలోనే మృతి చెందారు.


## కాసుల కోసం కన్నవారిపైనే గొడ్డలి వేటు

### సోదరి, నాయనమ్మలనూ చంపిన యువకుడు

**బహ్రాయిచ్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థికపరమైన కారణాలతో ఓ యువకుడు తన తల్లిదండ్రులు సహా నలుగురు కుటుంబ సభ్యులను గొడ్డలితో నరికి దారుణంగా హత్య చేశాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహ్రాయిచ్ జిల్లా రాంగావ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు. భూమి, బంగారం అమ్మడం ద్వారా వచ్చిన డబ్బు కోసం నిందితుడు నిరంకార్ (30), అతడి తండ్రి మధ్య ఆదివారం అర్ధరాత్రి గొడవ జరిగింది. ఆ ఆవేశంలో నిందితుడు.. గొడ్డలితో తల్లి, తండ్రి, సోదరి, నాయనమ్మలను నరికేశాడు. తర్వాత సోదరుడిపై దాడికి ప్రయత్నించినా అతడు తప్పించుకున్నాడు. నిరంకార్ కూడా తనను తాను ఇటుకతో పలుసార్లు బాదుకుని గాయపరచుకున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుణ్ని ఆసుపత్రికి తరలించామని వెల్లడించారు.

## దత్త పుత్రుడి నిర్వాకం..

### భారీ చోరీని ఛేదించిన పోలీసులు



**కాప్రా, విశ్వం వాయిస్ న్యూస్ :** మేడ్చల్ జిల్లా కుషాయిగూడ ఠాణా పరిధిలో ఇటీవల జరిగిన భారీ చోరీని పోలీసులు ఛేదించారు. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడన్న చందంగా పెంచుకుంటున్న కుమారుడే ఇంట్లోని సొత్తును దోచుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని 35 తులాల బంగారం, 3.70 కిలోల వెండి, రూ.2.13 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ డివిజన్ చక్రీపురంలోని మారుతీనగర్‌కు చెందిన ఆనంద నాగేశ్వరగుప్తా సిగరెట్ల హోల్‌సేల్ వ్యాపారి. అతనికి ఇద్దరు కుమార్తెలు. కుమారుడు లేకపోవడంతో ఎనిమిదేళ్ల కిందట ప్రాణస్నేహితుడి భార్య చనిపోవడంతో.. వారి కుమారుడు తిరుపతి రెడ్డి అలియాస్ మహేందర్ గుప్తా (28)ను పెంచుకుంటున్నారు. గత నెల 28న నాగేశ్వరగుప్త కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యక్రమానికి వెళ్లిన సమయంలో ఇంట్లో చోరీ జరిగింది. పెద్ద మొత్తంలో నగలు, నగదు చోరీ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన సమయంలో ఇంట్లో ఉన్న రెండు పెంపుడు కుక్కలు అరవలేదు. ఇంటి ఎదుట ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తే.. కెమెరాను పక్కకు జరిపినట్టు కనిపించింది. దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. కారు కొనుగోలు చేసి ట్రావెల్స్ వ్యాపారం పెట్టుకుందాం అని ఇంట్లో దొంగతనం చేసినట్లు మహేందర్ గుప్త నేరం అంగీకరించాడు. రూ.75 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకుని సోమవారం నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్టు పోలీసులు తెలిపారు.

## మియాపూర్‌లో నర్సు ఆత్మహత్య

**మియాపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని మియాపూర్ పీఎస్ పరిధిలో యువతి ఆత్మహత్య చేసుకుంది. మృతి చెందిన యువతిని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న సోనీ(20)గా గుర్తించారు. తాను ఉంటున్న గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### గ్రహణం సమయంలో

## రోకలి బండ ఎలా నిలబడుతుంది..?






సూర్య గ్రహణం, చంద్ర గ్రహణం సమయంలో రోకలిని నిలబెట్టడం ఇప్పటికీ సంప్రదాయంగా వస్తుంది. ఇత్తడి ప్లేట్ (తాంబూలం) లోనో బియ్యం పోసే రోట్లో లేదా నేల మీద నిలబెట్టడం గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా నేటికి కనిపిస్తుంది. ఈ ఆసక్తికరమైన ఆచారం వెనుక సైతం నమ్మకాలు, శాస్త్రీయ కోణాలు కనిపిస్తాయి. సూర్య గ్రహణం, చంద్ర గ్రహణం సమయంలో రోకలిని నిలబెట్టడం ఇప్పటికీ సంప్రదాయంగా వస్తుంది. ఇత్తడి ప్లేట్ (తాంబూలం) లోనో బియ్యం పోసే రోట్లో లేదా నేల మీద నిలబెట్టడం గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా నేటికి కనిపిస్తుంది. ఈ ఆసక్తికరమైన ఆచారం వెనుక సైతం నమ్మకాలు, శాస్త్రీయ కోణాలు కనిపిస్తాయి. చాలా మంది నమ్మకం ప్రకారం గ్రహణ సమయంలో భూమి, చంద్రుడు - సూర్యుడు ఒకే సరళరేఖలోకి రావడం వల్ల గురుత్వాకర్షణ శక్తిలో మార్పులు సంభవిస్తాయి. ఈ సమయంలో భూమిపై ఉండే అయస్కాంత శక్తి లేదా గురుత్వాకర్షణ ప్రభావం వల్ల రోకలి ఎటువంటి ఆధారం లేకుండా నిటారుగా నిలబడుతుందని నమ్ముతారు. గ్రహణ సమయంలో రోకలి నిలబడితే అది ఆ ప్రాంతానికి, ఆ ఇంటికి శుభప్రదమని మంచి జరుగుతుందని భావిస్తారు. పూర్వం గ్రహణం పట్టు విడుపులను తెలుసుకోవడానికి గడియారాలు లేనప్పుడు, రోకలి పడిపోవడాన్ని బట్టి గ్రహణం విడిచిందని గుర్తించే వారని పెద్దలు చెబుతున్నారు. అయితే, గ్రహణానికి రోకలి నిలబడటానికి ప్రత్యక్ష సంబంధం లేదని హేతువాదులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రోకలి కింద భాగం సమాంతరంగా ఉండి, దానిని సరైన కేంద్ర బిందువు వద్ద నిలబెడితే అది ఏ రోజైనా నిలబడుతుందనేది హేతువాదుల వాదన.. మరోవైపు గ్రహణ సమయంలో ప్రజలు ఎక్కువ శ్రద్ధగా, ఏకాగ్రతతో దానిని నిలబెట్టడానికి ప్రయత్నించడం వల్ల అది నిలబడుతుందే తప్ప, గ్రహణ శక్తి వల్ల కాదననేది శాస్త్రవేత్తల అభిప్రాయం. హేతువాదులు, సంప్రదాయవాదుల వాదనలు ఎలా ఉన్నా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నరసయ్య అగ్రహారంలో చంద్రగ్రహణం పురస్కరించుకుని ఇత్తడి పళ్లెంలో రోకలి నిలబెట్టారు రాజశేఖర్ దంపతులు. ఇది చూసేవారిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇత్తడి ప్లేట్ పై రోకలిని నిలబెట్టడాన్ని పలువురు ఆసక్తిగా చూసేందుకు వచ్చారు.

## గ్రహణానికే సవాల్..

### అన్నీ గుళ్లు మూసినా తెరిచే ఉండే ఈ ఆలయం గురించి తెలుసా..?



గ్రహణం ఉందంటే చాలు, కాశీ నుంచి రామేశ్వరం దాకా దేవాలయాలన్నీ మూతపడతాయి. కానీ ఆ ఒక్క క్షేత్రం మాత్రం గ్రహణానికే సవాల్ విసురుతోంది. గ్రహణ కాలంలోనూ ముక్కంటి దర్శనం ఇచ్చే అద్భుత క్షేత్రం.. రాహు కేతువుల నిలయం శ్రీకాళహస్తి. అసలు గ్రహణ సమయంలోనూ ఈ ఆలయం ఎందుకు తెరిచి ఉంటుంది? అనేది తెలుసుకుందాం.. సాధారణంగా గ్రహణం వచ్చిందంటే చాలు.. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాలన్నీ మూతపడతాయి. గ్రహణ సమయానికి కనీసం 6 గంటల ముందే ద్వారాలు మూసివేసి, గ్రహణం విడిచిన తర్వాత సంప్రోక్షణ చేసి మళ్ళీ తెరుస్తారు. కానీ ఈ సంప్రదాయానికి భిన్నంగా, గ్రహణ గండాలకు అతీత క్షేత్రంగా విరాజిల్లుతోంది చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి. చంద్ర గ్రహణం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ఆలయాలు మూతపడినా, శ్రీకాళహస్తీశ్వర ఆలయం మాత్రం భక్తుల కోసం యథావిధిగా తెరిచే ఉంటుంది. రాహు-కేతు క్షేత్రంగా పేరుగాంచిన ఈ ఆలయంలో గ్రహణ ప్రభావం ఉండదని పురాణాలు చెబుతున్నాయి. అందుకే గ్రహణ కాలంలోనూ ఇక్కడ స్వామి, అమ్మవార్లకు నిత్య పూజలు, అభిషేకాలు నిరాటంకంగా కొనసాగుతాయి.

### ప్రత్యేక గ్రహణకాల శాంతి అభిషేకాలు

మంగళవారం చంద్ర గ్రహణం నేపథ్యంలో ఆలయ అర్చకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రహణం మధ్యాహ్నం 3:20 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 6:47 గంటలకు ముగియనుంది. గ్రహణ కాల సమయంలోనే స్వామి, అమ్మవార్లకు గ్రహణకాల శాంతి అభిషేకాలు నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. గ్రహణ సమయంలో ముక్కంటిని దర్శించుకుంటే సకల దోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అందుకే ఈ సమయంలో భక్తులు భారీగా ఆలయానికి పోటెత్తుతారు.

### భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

గ్రహణ కాలంలో రాహు-కేతు దోష నివారణ పూజలు చేసుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. లోకమంతా గ్రహణ నియమాలను పాటిస్తూ ఇళ్లకే పరిమితమైనా.. శ్రీకాళహస్తిలో మాత్రం భక్తి పారవశ్యం వెల్లివిరుస్తోంది. గ్రహణ సమయంలోనూ ముక్కంటి దర్శనం కల్పించడం శ్రీకాళహస్తి క్షేత్రానికే దక్కిన అరుదైన గౌరవం. గ్రహణ గండాలను హరించే ఆ పరమశివుని చెంత భక్తులు తన్మయత్వంలో మునిగిపోతున్నారు.

# ఇఫ్తార్ విందులు శాంతి ప్రతీకలు

## కనిమా మసీదులో ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు శాంతికి ప్రతీకలని... ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి నిదర్శనమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం కోసం స్థానిక నారాయణ పురంలోని కనిమా మదీనా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రంజాన్ మాసం క్రమశిక్షణ... దాతృత్వం... ఆధ్యాత్మిక చింతనకు ప్రతీకని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీల అభివృద్ధికి, వారి విద్యా ఉద్యోగ అవకాశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మైనారిటీల రక్షణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



రంజాన్ పండుగ ప్రజల మధ్య ప్రేమ... సోదరభావం... ఐక్యతను పెంపొందిస్తుందని ఆకాంక్షించారు. ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఇవ్వడంతో పాటు వారి మతపరమైన ఆచారాలకు గౌరవం ఇస్తూ ప్రార్థన మందిరాల రక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధికి, సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనివారి ఆర్థిక సాధికారతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన గుర్తుచేశారు. తన సోదరులైన ముస్లిం మైనారిటీలంతా ఆరోగ్యం, సుఖశాంతులతో జీవించాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కాగా నగరంలోని పలు మసీదులు, షాదీ ఖానాల అభివృద్ధికి తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరపున నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్టు తెలిపారు. నగరంలోని మసీదులు, షాధి ఖానాలకు, ముస్లిం బరియల్కు ఇప్పటికే కమిటీలు నియమించినట్టు తెలిపారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు. అన్ని విషయాల్లోనూ ముస్లింలతో కలిసి ముందుకు నడుస్తామని, వారికి అండగా ఉంటామన్నారు. మత సామరస్యాన్ని కాపాడటమే కాకుండా అన్ని విధాలుగా ముస్లిం మైనారిటీలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేసింది ఒక్క తెలుగుదేశం మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీతి, నిజాయితీలకు బాలయోగి నిలువుటద్దం

## గన్ని కృష్ణ ఆధ్వర్యంలో బాలయోగి వర్ధంతి - ఘన నివాళులర్పించిన తెలుగు తమ్ముళ్లు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నీతి, నిజా యితీలకు బాలయోగి నిలువుటద్దం అని, నేటితరం నాయకులకు ఆయన ఒక రోల్ మోడల్ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. బాలయోగి 24వ వర్ధంతి సంద ర్భంగా గన్ని కృష్ణ ఆధ్వర్యంలో కంబాలచెరువు వద్ద వర్ధంతి కార్యక్రమం జరిగింది.



పార్కులో ఉన్న కాంస్య విగ్రహానికి గన్ని కృష్ణ తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గన్ని కృష్ణ మాట్లాడుతూ రాజకీయాలలో నీతి, నిజా యితీలకు బాలయోగి నిలువుటద్దమని అన్నారు. ఆయన విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు పదవ తరగతి పరీక్ష ప్రశ్నాపత్రం లీకైనప్పుడు ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేశారని అన్నారు. లోక్సభ స్పీకర్గా ఉన్నప్పటికీ కిందిస్థాయి కార్యకర్త కనబడగానే ఎంతో ఆప్యాయంగా పలకరించి బాగో గులు తెలుసుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు. కోనసీమలో రైలు కూత వినబడినప్పుడే బాలయోగికి నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందని ఈ విషయాన్ని ఆయన తనయుడు హరీష్ మాధుర్‌కి కూడా చెప్పానని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు, వెనుకబడిన తరగతుల వర్గాలకు చేయూత నిచ్చి ఉన్నతమైన స్థానములో కూర్చోబెట్టగలిగే పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. అప్పట్లో లోక్సభ స్పీకర్గా జిఎంసి బాలయోగి, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గా ప్రతిభా భారతీని నిలబెట్టి దళితులకు అత్యంత ప్రాధాన్యతను చంద్రబాబు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి కాశి నవీన్ కుమార్, పందిరి మహాదేవుడు సత్రం చైర్మన్ రెడ్డి మహేశ్వరరావు, జీవకారణ సంఘం చైర్మన్ వర్రె శ్రీనివాసరావు క్లస్టర్ ఇంచార్జ్ ఉప్పులూరి జానకి రామయ్య, జవాది మురళీకృష్ణ, బొమ్మనమైన శ్రీనివాస్, తంగెళ్ల బాబి, ఇన్నమూరి రాంబాబు, పాలవలస వీరభద్రం, నిమ్మలపూడి గోవింద్, తలారి భగవాన్, పెనుగొండ రామకృష్ణ, గొర్రెల రమణ, సంసాని ప్రసాద్, బెజవాడ వెంకటస్వామి, మళ్ల వెంకటరాజు, కరగాని వేణు, రఫిక్ రాజా,జక్కంపూడి అర్జున్, విశ్వనాథరాజు, శీలం గోవింద్, సయ్యద్ ఫయాజ్ రాజమంద్రపు శ్రీనివాస్, కెవి శ్రీనివాస్, వానపల్లి శ్రీనివాస్, సింహాద్రి కోటిలింగేశ్వర రావు, బాబీ, నూకల శ్రీనివాస్, ఆనంద్ సింహాద్రి లోకేష్, జాలెం నాని,కంచిపాటి గోవింద్,రొక్కం సత్యనారాయణ, ఆనెం చంటి,కవులూరి వెంకటరావు,గొర్స అప్పలకొండ, బిజెపి ఆచారి, అజ్జరపు రమేష్, చించినాడ తాతాజీ, పైలా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# బొబ్బిల్లంకలో దారుణం



## భార్యను అత్తను నరికి చంపిన భర్త

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామంలో చోడదాసి పండు, తను ప్రేమించి పెండ్లి చేసుకున్న భార్య లతను, అడ్డొచ్చిన అత్త లక్ష్మిని అతి కిరాకంగా కత్తితో నరికి చంపాడు. కుటుంబ కలహాలతో వీరిద్దరూ కొంతకాలంగా విడి పోయి దూరంగా ఉంటున్నారు. భార్య లత కొంతకాలంగా కోటి కేశవరం గ్రామంలో ఉన్న తన చెల్లి దగ్గర ఉండి ఇటీవల మళ్ళీ తల్లి దగ్గరకు బొబ్బిల్లంక వచ్చింది.గత రాత్రి ఇద్దరిపై దాడికి దిగిన పండు అలియాస్ సీతారాముడు తన భార్యను, అత్తను అతికిరాతకంగా నరికి చంపాడు. సీతానగరం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడుపై గతంలో నేరచరిత్ర ఉందని పోలీసులు తెలిపారు.

# సోమలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన గోరంట్ల దంపతులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక గాంధీ పురం నందు వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ పాత సోమలమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవములను పురస్కరించుకుని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఝాన్సీ లక్ష్మి దంపతులు అమ్మవారి ఆలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వైభవోపేతంగా నరసింహుడు చక్ర పెరుమాళ్లో తీర్థం

## - ఉండ్యాల్ సేవలో అలరిస్తున్న శ్రీ లక్ష్మీ నరసన్న



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా చివరి రోజు మంగళవారం శ్రీ లక్ష్మీ నం సింహస్వామి, చక్ర పెరుమాళ్ వారిని చెరో పల్లకిపై గిరి ప్రదక్షణ గావించి పాప నాసిని వద్దకు తోడుకొని వెళ్లారు. అనంతరం వేద పండితులు వేదమంత్రోచనాలతో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, చక్ర పెరుమాళ్ వార్లకు పంచామృత అభిషేకాలు, వివిధ ఫల పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్పి రంగరాజ బట్టర్ ఆధ్వర్యంలో వేద పండితులు శ్రీమాన్ పవన్ కుమార్ ఆచార్యులు స్వామి అమ్మవార్లను పాపనాసినిలో మూడు మార్లు మునక వేయించి, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రహణం అనంతరం ఆలయాన్ని సంప్రోక్షణ చేసి కళ్యాణోత్సవంలో భాగంగా ఉంజల్ సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఫల పుష్పాలు, కూరగాయలతో వివిధ ఆకృతులు భక్తులకు కనువిందు చేసి, స్వామి అమ్మవార్లను అద్దంలో దర్శింపజేశారు. కార్యక్రమంలో వేద పండితులు, అన్నవరం దేవస్థానం అధికారులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# విద్యా బాల మందిర్ విద్యార్థులు విజ్ఞాన కేంద్రం సందర్శన

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూలు విద్యార్థులు రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం సందర్శించారు.వీరికి తెలియని ఎన్నో విజ్ఞాన విషయాలు ప్రయోగాత్మకంగా చూసి తెలుసుకున్నారు.వీరు మొక్కలు ఆహారం తయారు చేసుకోనె విధానం , మురుగు నీటిని శుద్ధి చేసే విషయం, గురుత్వాకర్షణ శక్తి గురించి, నీటి కొరత మొదలైన అనేక విషయాలు గురించి తెలుసుకున్నారు.వీరికి మా పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కందికట్ల శ్రీనివాస్,బూషి శ్యామల వివరించారు తదుపరి ధవళేశ్వరం కాటన్ పార్క్ సందర్శించారు ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రేమ అక్షిత , కామాక్షి ,విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ వర్కర్లపై పోలీసుల తీరు అమానుషం : అన్నపూర్ణ

## కోరుకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారం - ప్రభుత్వ తీరుకు సిడిపిఓ కార్యాలయం వద్ద నిరసన



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడి వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల కోసం విజయవాడలో శాంతియుతంగా నిరసన దీక్ష చేపట్టిన వారిని అక్రమంగా నిర్బంధించి, పోలీస్ స్టేషన్కు తరలించడం అమానుషమని అంగన్వాడీ వర్కర్ల నాయకురాలు అన్నపూర్ణ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ప్రభుత్వానికి, పోలీసుల అక్రమ అరెస్టులకు నిరసన వ్యక్తం చేస్తూ కోరుకొండ సిడిపిఓ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. కార్యాలయం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ కు చేరుకొని పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, ఎంతో కాలంగా కాలయా పనిచేస్తున్న తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ, సీతానగరం గోకవరం మండలాల ఐసిడిఎస్ సిబ్బంది, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.


# సీతానగరంలో ఘనంగా బత్తుల జన్మదిన వేడుకలు

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రంలో జన సైనికుల ఆధ్వర్యంలో రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, అభిమానులు భారీ కేకులు కట్ చేసి ఒకరినొకరు కేకులు తినిపిం చుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు, వీర మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.




# కోయ బాల సాహిత్య పుస్తకాల ఆవిష్కరణ సభ విజయవంతం చేద్దాం

## కోయత్తోర్ బాట 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆదివాసీ మేధావులందరికి ప్రత్యేక ఆహ్వానం




**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** మార్చి 7న రామన్నపాలెం గ్రామం, చింతూరు మండలంలో 3 కోయ బాలల పుస్తకాల ఆవిష్కరణ సభ ఇంకా 25 ఏళ్ల వేడుకలకు ఆదివాసీ మేధావులందరికి ప్రత్యేక ఆహ్వానం పలుకుతున్నామని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మార్చి 7 న ఉదయం 11గంటల నుండి కోయత్తోర్ బాట గత 25 సంవత్సరాలుగా,కోయ బాల సాహిత్యాన్ని ముందుకు తీసుకు పోవడానికీ మొదటి తరం రచయితలను వెలికి తీయడానికీ కృషి చేస్తూ వస్తున్నది.కోయత్తోర్ బాట 2001 నుండి 2013 వరకు చదువు మధ్య లో మానేవేసిన వారి కొరకు బ్రిడ్జి కోర్సులు నిర్వహించిన సంగతి అందరికీ తెలిసినదే.ఈ కార్యక్రమం భద్రాచలం ఏజెన్సీతో పాటు,ఐటీడీఏ ఏటూరు నాగారం పరిధి లోనూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏ పరిధిలోనూ జరిగిన సంగతి చాలా మందికి తెలుసు.ఈ విద్యా కార్యక్రమాల ద్వారా రెండు వేలకు పైగా కోయ ,గోండ్, నాయక పోడ్, కొండరెడ్డి, కోలాం, పర్ధాన్ తెగలకు చెందిన ఆదివాసీ యువతి యువకులు చదివి వివిధ రంగాల్లో ఉద్యోగాల లోనూ,రాజకీయాల లోను స్థిరపడ్డ వారు చాలా మంది ఉన్నారని మీకు తెలిసిన విషయమే.ఇట్టి బాల సాహిత్యం తయారు చేయడానికి పలు సార్లు,పలు విడతలుగా కార్యశాలలు నిర్వహించడం, పాఠశాలలలో, హాస్టళ్ళలో, గ్రామాలలో, అనేక సమావేశాలలో కోయ బాల గేయాలను పాడి వినిపించడం జరుగుతూ ఉంది. 2001లో మొదలైన కోయ బాల సాహిత్య కార్యశాలలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.అనేక మంది ఔత్సాహిక మిత్రులు పాఠశాలలోకీ, వసతి గృహాలలోకి వీటిని తీసుకువెళ్ళడం హర్షించదగిన విషయం. విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా బాగా కోయ బాల సాహిత్యాన్ని అభిమానిస్తున్నారు. మన ఈ బాలల గేయాలు మూడు రాష్ట్రాల పిల్లల లోకి వెళ్ళడం కోయభాష అభివృద్ధికీ ఎంతో ఉపయోగపడనున్నవి.కేవలం కోయత్తోర్ బాట మాత్రమే గాక అనేక ఆదివాసీ యువజన, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఈ కృషిలో పాలుపంచు కోవడం బహు హర్షణీయం. ప్రస్తుత మూడు కోయ బాల గేయాల పుస్తకాలు వచ్చి ఉన్నాయి.(1) “విజ్జ” అనేక మంది రచయితలు రాసిన సంకలనం.(2) “అలిం బిలిం కోటై” రచన : (దుమ్మిరి భీమమ్మ రామన్నపాలెం ).(3) “గాలీ గాలీ కుక్కూ”.రచన : తెల్లం కృష్ణ (తెల్లం వారి గూడెం ).ఈ మూడూ దేనికదే సాటి.ఈ మూడు పుస్తకాలలో ఇంకో ప్రత్యేకత కూడా ఉంది.ఈ మూడూ మంచి అందమైన రంగుల అట్టలు బొమ్మలతో వచ్చాయి.లోపలి బొమ్మలు కూడా మీ దృష్టిని ఆకర్షిస్తాయి.ఈ బొమ్మలు వేసిన వారు మన కోయ శిల్పి,చిత్రకారులు బొక్కిలి నాగేశ్వర రావు.వీరు మంచి చిత్ర కారులు మాత్రమే కాదు,మంచి కవి కూడా వీరి గేయాలు కూడా “విజ్జ” పుస్తకం లో చోటు చేసుకున్నాయి.ఈ మూడు పుస్తకాలలో ఉన్న గేయ రచయితలను గమనిస్తే చాలా విషయాలు అర్థం అవుతాయి.వయస్సు రీత్యా చూస్తే రచయితలలో 50 దాటిన వారూ ఉన్నారు.15,16 ఏళ్ల వారూ ఉన్నారు.మూడు తరాలు ఈ కృషి లో ఉన్నవి.ఈ కోయ సాహిత్య కృషిని ఆప కుండా కొనసాగిస్తే భవిష్యత్తుకు తిరుగు ఉండదు.గత రెండున్నర దశాబ్దాలుగా కోయ బాల గేయాలను వినుకుంటూ, పెరుగుతూ - ఎదుగుతూ వస్తున్న నేటి తరం భవిష్యత్తు లో ఎంతో సాదించ గలదు.మీరు ప్రతీ ఒక్క గేయం చదివి చూడండి.ప్రతీ గేయం మిమ్మల్ని ఆలోచింపచేసేలా చేస్తుంది.ఆగి మరీ తిరిగి చూసుకునేలా చేస్తుంది. ఇంత మంది రచయితలు,అది భిన్న వయస్సుల వాళ్ళు ఉండడం అనేది చెప్పుకోదగిన విషయం.ఈ పరిణామం కోయ బాల సాహిత్యానికి మాత్రమే కాదు పూర్తిగా కోయ సాహిత్యానికీ,కోయ భాష ను మన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 8లో చేర్చుటకు గుర్తింపు ఇచ్చుట కొరకు ఈ ప్రయత్నం ఒక ఉపకారిగా వేసిన ఒక ముందడుగు కాదలదు.జాతికి మంచి రోజులు రానున్నాయని సూచిస్తుంది. ఈ సందర్భంగా నిర్వహించ తలచిన పుస్తక ఆవిష్కరణ సభకు ఆదివాసీ పెద్దలూ,పిల్లలూ అందరూ ఆహ్వానితులే,ఉపాధ్యాయులూ,విద్యార్థి యువజన మిత్రులు అందరూ ఇదే మా ఆహ్వానంగా భావించి, పిల్లా పాపాలతో, బంధుమిత్రు లతో మార్చి 7 తేదీన ఉదయం 11 గంటల కల్లా రావలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము.నేటికి కోయత్తోర్ బాట ఏర్పడి 25 ఏళ్ళ కి చేరుకుంటున్న సందర్భంగా 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సందర్భాన్నీ పండగను జరుపుకుందాం రండి. ఆదివాసీ మేధావులందరూ ఆహ్వానితులే.



**సంప్రదించవలసిన వారు:**

కోయత్తోర్ బాట, రామన్నపాలెం.చింతూరు మండలం.పోలవరం జిల్లా, ఆంధ్రప్రదేశ్. పూర్తి వివరాలకు :దుమ్మిరి భీమమ్మ (సెల్: 9490517685)జల్లి మల్లయ్య (సెల్: 8179840390) సంప్రదించగలరు.

గల్ఫ్ దేశాల్లో ఉన్న ప్రవాస ఆంధ్రులతో

# వీడియో కాల్ మాట్లాడి ధైర్యం చెప్పిన మంత్రి సుభాష్

## ఏపీ ఎన్ఆర్టిసి హెల్ప్‌లైన్ ద్వారా పూర్తి సహాయం అందిస్తామని భరోసా



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** గల్ఫ్ దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రవాస ఆంధ్రులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. ఇజ్రాయిల్ - ఇరాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం కారణంగా నెలకొన్న పరిస్థితులు,ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వారికి భరోసా కల్పించారు. యుద్ధ వాతావరణం కారణంగా కొన్ని విమానాశ్రయాలలో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎన్.ఆర్.ఐ సాధికారత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తాను ఎప్పటికప్పుడు పరిస్థితి పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులకు ధైర్యం చెబుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రవాస ఆంధ్రుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించేందుకు Andhra Pradesh Non-Resident Telugu Society ఈమెయిల్: helpline@apnrts.com లకు, 24/7 హెల్ప్ లైన్, ౦918500027678 వాట్సాప్ ద్వారా సమాచారం అందించ వచ్చునన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఆంధ్రులందరూ ఆందోళన చెందకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన ప్రతి కార్మికుడి భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇరుదేశాల మధ్య త్వరలోనే శాంతి నెలకొని సాధారణ పరిస్థితులు ఏర్పడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న కార్మికుల ప్రతినిధి బొంతు నాగరాజు సంక్షోభ సమయంలో తమతో ప్రత్యక్షంగా మాట్లాడి ధైర్యం చెప్పినందుకు ప్రత్యేకంగా అభినందించారు. మస్కెట్ నుంచి బొంతు నాగరాజు, కట్టా నాగమల్లేశ్వరరావు, కువైట్ నుండి కట్టా భాస్కర్ అధ్యక్షులు బీసీ చైతన్య వేదిక గల్ఫ్ వ్యవస్థాపకులు, గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ, దుబాయ్ నుండి కదలి వెంకటకృష్ణ, UAE శెట్టిబలిజ ఐక్యసంఘం, ఖాతార్ నుండి పితాని సత్యనారాయణ(సత్యమూర్తి) బెహరిన్ నుంచి చింతపల్లి లక్ష్మీనారాయణ, సౌదీనుండి పితాని రాంబాబు తదితరులు మంత్రి సుభాష్ తో వీడియో కాల్ ద్వారా అక్కడి పరిస్థితులు వివరించారు. కార్మికుల పట్ల మంత్రి సుభాష్ కున్న చిత్తశుద్ధిని ప్రస్తుతించి కృతజ్ఞతలు తెలియజేశారు.

# అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధకాండ అమానుషం

## సీఐటీయూ నేతల ఆగ్రహం - అక్రమ అరెస్టులకు నిరసనగా అమలాపురంలో భారీ ప్రదర్శన, మానవహారం

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అంగన్వాడీ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నిర్బంధకాండ అమానుషమని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి. దుర్గాప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. విజయవాడ ధర్నా చౌక్‌లో తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా మహాధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను తెల్లవారుజామున పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ, అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ నుండి గడియార స్తంభం సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో మానవహారం చేపట్టారు. నిరసన సభలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయమని శాంతియుతంగా ధర్నా చేస్తుంటే, పోలీసులు లైట్లు ఆపి చీకట్లో మహిళలను ఈడ్చి అరెస్టులు చేయడం దారుణమని అన్నారు. పోలీసుల దాడిలో కొంతమంది స్పృహ తప్పి పడిపోయారని తెలిపారు. చంద్రబాబు నాయుడు చెప్పే మహిళా సాధికారత ఇదేనా? అని ప్రశ్నించారు. సమగ్ర శిశు అభివృద్ధి సేవలు (ఐసీడీఎస్) ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటికీ అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించలేదని, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడు సంవత్సరాలుగా ధరలు అమాంతం పెరిగినా ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సేవలందిస్తున్న అంగన్వాడీలను నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్లకు భారీ రాయితీలు ప్రకటించినప్పటికీ ఐసీడీఎస్‌కు తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో కూడా అంగన్వాడీలకు సరిపడ నిధులు కేటాయించలేదని తెలిపారు. 2024 జూలైలో 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా వేతనాలు పెంచుతామని రాతపూర్వకంగా ఇచ్చిన హామీకి ప్రస్తుత బడ్జెట్‌లో ప్రతిఫలం లేదని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో టీడీపీ జనసేన నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. అంగన్వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు



చేయాలని, అర్బన్ రూరల్ తేడా లేకుండా అందరికీ సమానంగా ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రీస్కూల్ పిల్లలకు ఇస్తున్న సాయంత్రం అల్పాహారాన్ని పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మే నెలలో వేసవి సెలవుల జీఓ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు బియ్యం, నూనె, కందిపప్పు పరిమాణం పెంచాలని, మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 1810 మినీ వర్కర్లకు అర్హత సడలింపు ఇచ్చి ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, ఐసీడీఎస్‌కు తగినంత బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.టి.వి. సుబ్బారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు పింకే వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి పి. అమూల్య, ప్రాజెక్ట్ కార్యదర్శి కె. రత్నకుమారి, అధ్యక్షులు ఎం. విజయ, కె. బేబీ గంగరత్నం, దైవకృప, ఏ. సీత, భవాని సీతామహాలక్ష్మి, దుర్గాభవాని, సత్యవేణి, సీతామహాలక్ష్మి, చంద్రకళ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సకిలే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. యూటీఎఫ్ సీనియర్ నాయకులు శివకుమార్ పాటలు పాడి నిరసనకారులను ఉత్సాహపరిచారు.

# ఘనంగా జిఎంసి బాలయోగి వర్ధంతి కార్యక్రమం



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ లోక్‌సభ స్పీకర్ జిఎంసి బాలయోగి 24వ వర్ధంతి. పుల్లేటికుర్రు గ్రామ పంచాయతీ కార్యలయము వద్ద మంగళవారం బాలయోగి చిత్రపటానికి పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ జిఎంసి బాలయోగిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఎన్టీఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక విరభద్ర శర్మ ఏర్పాటు ( బుల్లయ్య ) ఆర్థిక సహాయంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరా రవి ,నూకపెయ్యి చిన్న, అకెళ్ళ సూరిబాబు, నీటి సంఘము డైరెక్టర్ గంటి శ్రీనివాస రావు, అంబటి రాధాకృష్ణ, కోసూరి సూరిబాబు తదితరులు పాల్గొని నివాళ్ళులు అర్పించి పూలమాలలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే హై స్కూల్ వీధి వద్ద ఉన్న. బాలయోగి విగ్రహంనకు సర్పంచ్. జల్లి బాలరాజు పూలమాలలు వేసి వేసి నివాళులు నివాళులర్పించారు.

సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో

# జిఎంసి బాలయోగి 24వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మాజీ లోక్‌సభ స్పీకర్ జిఎంసి బాలయోగి 24వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి మాట్లాడుతూ, కోనసీమ ప్రాంత అభివృద్ధికి అమూల్యమైన సేవలు అందించిన మహనీయుడు జిఎంసి బాలయోగి అని పేర్కొన్నారు. సాధారణ కుటుంబం నుంచి ఎదిగి దేశ అత్యున్నత పదవులలో ఒకటైన లోక్‌సభ స్పీకర్ పదవిని అలంకరించిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని అన్నారు. ప్రజా సేవలో నిష్ట, నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన మహానుభావుడిగా బాలయోగి చిరస్మరణీయులని తెలిపారు. బోడసకురు గ్రామ ప్రజలు ఆయన ఆశయాలను కొనసాగిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా సర్పంచ్ పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం బాలయోగి వర్ధంతిని నిర్వహించడం ద్వారా యువతలో సేవాభావం పెంపొందించడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు అరవ చంటి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అడపా శ్రీను, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ళ శ్రీను, మండల తెలుగు యువత అధ్యక్షులు ముత్యాల బాబి, పాలకవర్గ సభ్యులు చింతం శ్రీను, ఓలేటి పరమేశ్వరరావు, రొక్కాల నాగేశ్వరరావు, అయినమిల్లి సూర్యనారాయణ, దొమ్మేటి రాధాకృష్ణ, దొమ్మేటి రాజు, జల్లి రాధాకృష్ణ, అయిల నాగేశ్వరరావు, కూటమి నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో బాలయోగి ఆశయాలను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించి ఘన నివాళులర్పించారు.

మహిపాల చెరువు నుండి పల్లంకుర్రు వరకు

# రహదారి అభివృద్ధికి రూ.30 లక్షలు మంజూరు



**ముమ్మిడివరం విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి,ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, ముమ్మిడివరం నియోజకవర్గంలో మహిపాల చెరువు నుండి పల్లంకుర్రు వరకు రహదారి అభివృద్ధి పనుల కోసం రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ బి రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పూర్తిగా దెబ్బతిన్న రహదారులను పునర్నిర్మించి, ప్రజలకు సురక్షితమైన మరియు సౌకర్యవంతమైన ప్రయాణ సదుపాయాన్ని కల్పించడం తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.నిర్లక్ష్యానికి గురైన రహదారులు ఇప్పుడు అభివృద్ధి దిశగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి మార్గంలో వేగంగా ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. ఈ రహదారి అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరనుంది.

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా

# కత్తులు వెంకటేశ్వరరావుకు ఘన సన్మానం



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అంబాజీపేట మండలం తొండవరం జిల్లా పరిషత్ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కత్తులు వెంకటేశ్వరరావుకు మంగళవారం అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో ఘన సన్మానం నిర్వహించారు. విద్యా రంగంలో, ముఖ్యంగా జీవశాస్త్ర విభాగంలో ఆయన అందిస్తున్న విశేష సేవలను గుర్తిస్తూ ఈ సన్మానం చేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం వారోత్సవాల సందర్భంగా స్టేట్ బయోఫామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, జీవశాస్త్ర బోధనలో ప్రతిభ కనబరచడంతో పాటు పాఠ్యపుస్తక రచయితగా (టెక్స్ట్ బుక్ రైటర్) సేవలు అందించడం, స్టేట్ ఎస్ఆర్పీగా బాధ్యతలు నిర్వర్తించడం, సైన్స్, జీవశాస్త్ర రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ పలు సృజనాత్మక కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేసవాచార్యులు మాట్లాడుతూ, కత్తులు వెంకటేశ్వరరావు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. విద్యా రంగంలో నిబద్ధత, కృషి, సేవా భావంతో ముందుకు సాగుతున్న కత్తులు వెంకటేశ్వరరావుకు లభించిన ఈ గౌరవం పాఠశాలకే కాకుండా మొత్తం ప్రాంతానికి గర్వకారణమని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

కోనసీమ ప్రజల గుండెల్లో జీఎంసీ బాలయోగి చిరస్థాయిగా

# ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటారు : ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** బాలయోగి వర్ధంతి సందర్భంగా కొత్తపేటలో నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఈ ప్రాంత అభివృద్ధిలో అడుగడుగున ఆయన జాడలున్నాయి. కోనసీమ ముద్దుబిడ్డ, భారత లోక్ సభ మాజీ స్పీకర్ గంటి మోహన చంద్ర బాలయోగి సేవలు అజరామరమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం బాలయోగి వర్ధంతి సందర్భంగా ఆయన కొత్తపేట బస్టాండ్ సెంటర్ లో విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే బండారు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోనసీమ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన బాలయోగి పేరు ప్రఖ్యాతులు ఇక్కడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని కొనియాడారు. కోనసీమలో ఏ మూలకు వెళ్ళినా ఈ ప్రాంత అభివృద్ధిలో ఆయన అడుగుజాడలు కనిపిస్తాయన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో జాతీయ రహదారి రావడానికి, జొన్నాడ వద్ద, సిద్ధాంతం వద్ద నూతనంగా రెండు వారధులు ఏర్పడడానికి ఆయనే కారణమన్నారు. యానాం - ఎదుర్లంక వారధి, బోడసకుర్రు వారధుల నిర్మాణానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అందరితో సఖ్యంగా ఉంటూ మన బాలయోగి, మనవారు అని పేరు తెచ్చుకున్నారన్నారు. ఒక దశాబ్ద కాలం పాటు వివిధ పదవుల్లో ప్రజా ప్రతినిధిగా సేవలందించి లోక్సభ స్పీకర్ గా ఉన్నత శిఖరాలకు చేరారన్నారు. వారి మీద అభిమానంతో వారి కుమారుడు హరీష్ మాధూర్ పార్లమెంటు సభ్యునిగా ఉన్నారన్నారు. ప్రజల హృదయాల్లో చిరకాలం బాలయోగి నిలిచి ఉంటారని కొనియాడారు. ఆయన బాటలో నడిచి కోనసీమ అభివృద్ధికి తామంతా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా మహిళా రక్షణ చట్టాలపై విస్తృత అవగాహన




**జిల్లా ఎస్పీ రాహుల్ మీనా**

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా మహిళలు, విద్యార్థులు, ప్రజల రక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు భారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక రుగ్మతల నిర్మూలనపై పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. మహిళలు, యువతుల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో శక్తి బృందాల సేవలను ఎలా పొందాలో వివరించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న వేధింపుల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. పిల్లలపై జరిగే అకృత్యాలను అరికట్టేందుకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అటువంటి ఘటనలు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలకు వేధింపులు కలగకుండా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా శక్తి బృందాలు, శాంతి బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ మహిళలు, పిల్లల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతరం గస్తీ, అవగాహన సదస్సులు కొనసాగుతాయని తెలిపారు.

# రావులపాలెంలో ఘనంగా హోలీ పండుగ వేడుకలు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెంలో హోలీ పండుగ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధులు, కాలనీలు రంగుల హరివిల్లుల్లా మారాయి. చిన్నారులు, యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఉదయం నుంచే యువకులు గుంపులుగా చేరి ఒకరిపై ఒకరు రంగులు చల్లి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. డీజే పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. హోలీ పండుగ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజలు శాంతియుతంగా శాంతియుత వాతావరణంలో హోలీ వేడుకలు జరుపుకోవడం విశేషం.

# స్వర్గీయ జిఎంసి బాలయోగి సేవలు చిరస్మరణీయం

## వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన మంత్రి సుభాష్, కూటమి పార్టీ నాయకులు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత మాజీ లోక్సభ స్పీకర్ స్వర్గీయ జీఎంసీ బాలయోగి దేశానికి చేసిన సేవలు చిరాస్మరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంగళవారం రామచంద్రపురం లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో స్వర్గీయ జిఎంసి బాలయోగి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన బాలయోగి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. మాజీ లోక్‌సభ స్పీకర్‌గా బాలయోగి ప్రజాస్వామ్య పరిరక్షణలో, పార్లమెంటరీ వ్యవస్థ బలోపేతంలో చేసిన సేవలు చిరస్మరణీయమని మంత్రి కొనియాడారు. సామాన్య కుటుంబం నుంచి ఎదిగి అత్యున్నత పదవిని అధిరోహించడం యువతకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడిగా ఆయనను అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని ఘన నివాళులర్పించారు.

# జిఎంసి బాలయోగి వర్ధంతి సందర్భంగా ఘననివాళి



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం నియోజకవర్గం లో ఘణంగా మాజీ లోక్ సభాపతి, స్వర్గీయ జిఎంసి. బాలయోగి వర్ధంతి ఎదుర్లంక, రామాలయంపేట, ముమ్మిడివరం, కాట్రేనికోన గ్రామాల్లో బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎంఎల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రావు, జిల్లా పార్టీ అద్యక్షులు గుత్తుల సాయి, మాజీ ఎం. ఎల్. ఎ. చెల్లి వివేకానంద, రాష్ట్ర ఎస్సి కార్పోరేషన్ డైరెక్టర్ సి.హెచ్. అశోక్ టిడిపి,ఫిషరీష్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరావు,జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాలుగోన్నారు.





# అక్రమాలకు 'సేవ' ముసుగు..

## అడిగిన పాత్రికేయులపై నిందలు

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ పరిధిలో ఉన్న వాకలపూడి 'ఉమా మనోవికాస కేంద్రం' సెక్రటరీ అనుసరిస్తున్న తీరు దివ్యాంగుల సేవ అనే పవిత్రమైన పేరును అడ్డం పెట్టుకుని, నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ కట్టడాలకు తెరలేపారు. అనుమతి పొందింది రెండు అంతస్తులకైతే, మూడు అంతస్తులు నిర్మించడం అక్రమం కాదా అని రూరల్ పాత్రికేయులు అడగక దీనికి సమాధానం చెప్పలేక పాత్రికేయుల ప్రతినిధులపై నిందలు వేయడం , జిల్లా కలెక్టర్ వారికి పాత్రికేయులందరూ మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని కంప్లైంట్ ఇవ్వడం చాలా బాధాకరంగా ఉంది. ఈ విషయంలో పాత్రికేయుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు.

**నిజాలు నిప్పులాంటివి:**

వ్యక్తిగత ఆస్తి - సంస్థ రంగు: భవన అనుమతులు వ్యక్తుల పేరు మీద ఉంటే, దానిని సంస్థ భవనంగా చిత్రీకరించి కలెక్టరేట్ మెట్లెక్కడం అధికారులను తప్పుదోవ పట్టించడమే.

బిపిఎస్ అంటే తప్పు అంగీకరించడమే: "మేము బి.పి.ఎస్ కడతాం" అని సెక్రటరీ చెప్పడం అంటేనే, తాము నిబంధనలు ఉల్లంఘించామని ఒప్పుకున్నట్లు లెక్క. మరి తప్పు ఒప్పుకున్నాక, దాన్ని వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టులు 'బ్లాక్ మెయిలర్లు' ఎలా అవుతారు?

కథనం 2: సెక్రటరీ గారూ.. ఇవే మా సూటి ప్రశ్నలు!

అక్రమ నిర్మాణంపై వివరణ ఇవ్వాల్సింది పోయి, పత్రికా స్వేచ్ఛపై దాడి చేస్తున్న సదరు యాజమాన్యానికి మీడియా సంధిస్తున్న ప్రశ్నలు ఇవే:

1. ప్లాన్ ఒకలా.. నిర్మాణం మరోలా ఎందుకు? మీరు చట్టానికి అతీతులా? లేక దివ్యాంగుల పేరు చెబితే అధికారులు భయపడతారని మీ భావనా?

2. 35 మంది జర్నలిస్టులా? ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఏకంగా 35 మంది మీడియా ప్రతినిధులు వచ్చి డబ్బులు అడిగారని ఆరోపించడం మీ అహంకారానికి పరాకాష్ట కాదా? సాక్ష్యాలు ఉంటే బయటపెట్టండి, లేదంటే బహిరంగ క్షమాపణ చెప్పండి.

3. పిల్లల భద్రత ఏది? నిబంధనలకు విరుద్ధంగా కట్టే భవనాల్లో రేపు ప్రమాదం జరిగితే ఆ దివ్యాంగ పిల్లల ప్రాణాలకు బాధ్యత ఎవరు వహిస్తారు? మీ స్వార్థం కోసం వారి భద్రతను పణంగా (ఉదాహరణకు: ఆ భవనం ప్లాన్ కాపీలు లేదా ఇతర ఆధారాలు) జోడించి కథనాన్ని మరింత బలోపేతం చేయాలనుకుంటున్నారా??

**చట్టం 'చుట్టం' కాదు.. కలెక్టర్ గారూ కఠినంగా వ్యవహరించండి!**

'సేవ' అనే ముసుగులో సాగుతున్న ఈ అక్రమ దందాను అడ్డుకోవాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది. అనుమతులు లేని అదనపు అంతస్తులను తక్షణమే కూల్చివేయాలి. అక్రమ నిర్మాణం చేస్తూ, అధికారులను తప్పుదోవ పట్టిస్తూ, జర్నలిస్టుల ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న ఎస్.పి. రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. చట్టం అందరికీ ఒక్కటేనని, 'సెంటిమెంట్' కార్డులు అక్రమాలకు లైసెన్సులు కావని నిరూపించాల్సిన సమయం ఆసన్నమైంది.

**ముగింపు వ్యాఖ్య:**

తప్పు చేసిన వారు తలదించుకోవాలి.. అంతే తప్ప ఎదురుదాడి చేయడం వారి నైచ్యానికి నిదర్శనం. అక్రమ కట్టడాల వెనుక ఉన్న అసలు రహస్యాలను, ఆ స్వార్థ ప్రయోజనాలను బయటపెట్టే వరకు మీడియా తన పోరాటాన్ని ఆపదు.

### 120 మంది హెచ్ఐవి చిన్నారులకు

# న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం సీతయమ్మపేట రిఫరల్ హాస్పిటల్ ప్రాంగణంలో సంకల్ప సంస్థ ఆధ్వర్యంలో రంగోలి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు, తుని, పిఠాపురం నియోజకవర్గాల్లోని 11 మండలాల నుంచి ఈ కార్యక్రమానికి హాజరైన 120 మంది హెచ్.ఐ.వి. బాధిత చిన్నారులకు ఒక్కొక్కరికీ రూ. 750 విలువచేసే న్యూట్రిషన్ కిట్‌తో పాటు రానూ, పోనూ ప్రయాణ ఖర్చులకు సరిపడా నగదుని అందచేసారు. ఈ చిన్నారులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఆట పాటలతో సందడి చేశారు. చిన్నారులు అందరికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చిన్నారులను ఉద్దేశించి సంకల్పం సంస్థ సభ్యులు మాట్లాడుతూ... హెచ్.ఐ.వి. బాధితులు అందరూ రోగ నివారణ కోసం మందులను, సంపూర్ణ ఆరోగ్యం కోసం మంచి పౌష్టికాహారాన్ని ప్రతీ రోజూ తీసుకోవాలని సూచించారు. తాము నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమాలు సమాజంలోని హెచ్.ఐ.వి. బాధితుల పట్ల అవగాహన పెంచడమే కాకుండా, బాధితుల గౌరవాన్ని కాపాడేందుకు సహకరిస్తాయని తెలిపారు. హెచ్.ఐ.వి. చిన్నారులకు అండగా నిలబడటమే కాకుండా ఆ చిన్నారుల పట్ల సమాజం ఎలాంటి వివక్ష చూప కూడదన్న సందేశాన్ని ప్రజలకు చేర వేయాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏటేటా నిర్వహిస్తున్నట్టు సంస్థ సభ్యులు ప్రకటించారు. అనంతరం చిన్నారులతో కలసి సంకల్ప సంస్థ కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఆత్మీయ విందును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రిఫరల్ హాస్పిటల్ యాజమానులు పాల్గొన్నారు.

# హోలీలో నిరుపేదల ఆకలి తీర్చిన 'సూర్యోదయ సంస్థ'



**తుని, విశ్వం వాయిస్ న్యూస్ :** హోలీ దేను జాలీ దేగా ప్రపంచం అంతా పండగను చేసుకుంటుంది. రోజంతా పండుగ వాతావరణంలో సంతోషంగా, ఉల్లాసంగా గడుపుతూ తృప్తిగా సుష్టుగా విందారగిస్తారు. ఇది సాగినోళ్ళ నోళ్ళకు సుసాధ్యం అయ్యే పని. అదే మరి కూటికి గతిలేని, మింగ మెతుకులేని అనాధలు, వృద్ధులు, వికలాంగులు, అభాగ్యులకు అసాధ్యమైన పని. ఈ అసాధ్యమైన పనిని సుసాధ్యం చేసింది తునిలోని సూర్యోదయ సంస్థ. ఈ ఒక్క రోజైనా కూటికి లేని అభాగ్యులకు సుష్టుగా భోజనం పెట్టాలని సూర్యోదయ సంస్థ సంకల్పించింది. హోలీని పురస్కరించుకొని పేదవారి ఆకలిని తీర్చింది. కాకినాడ జిల్లా నియోజకవర్గం కేంద్రం తునిలోని గొల్ల అప్పారావు సెంటర్, బస్టాండ్ లతో పాటు వివిధ ప్రాంతాల్లోని నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులకు మంగళవారం భోజన పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకు వైరా రెస్టారెంట్ అధినేత భూపతి రాజు సహాయాన్ని సూర్యోదయ సంస్థ అర్థించింది. భూపతి రాజు విరాళంగా అందించిన రుచికరమైన భోజన పదార్థాలను ఆహార పొట్లాలుగా సిద్దం చేసి సుమారు 150 మంది అభాగ్యులకు పంపిణీ చేశారు. ఈ ఒక్కో రోజు పేదల ఆకలి తీర్చిన, క్షుద్బాధితుల కళ్ళల్లో ఆనందం నింపిన ఈ కృషిలో తునిలోని సూర్యోదయ సంస్థ సమన్వయకర్త తమరాన రామకృష్ణ సతీష్ వర్మ, సి.హెచ్. సతీష్, జె.ఎస్.ఎన్. గోపి, శ్రీను, శివ ముఖ్యపాత్ర పోషించారు.

# చంద్రగ్రహణాన ఇత్తడి పళ్లెంలో రోకలి నిలబెట్టారు





**కిర్లంపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రమణయ్యపేట కాలనీ వాసులు చంద్రగ్రహణం సందర్భంగా ఇత్తడి పళ్లెంలో నీళ్లు పోసి ఏ ఆసరా లేకుండా రోకలిని నిలబెట్టారు. అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసి ఔరా అనిపించారు. సాధారణ సమయంలో నిలబెడితే భూమ్యాకర్షణ శక్తి, ఇతర శక్తుల ప్రభావం వల్ల పడిపోయే రోకలి ఈ గ్రహణం సమయంలో మాత్రం స్థిరంగా నిలబడుతుందని రమణయ్య పేట కాలనీ వాసుల నమ్మకం. ఈ నమ్మకంతోనే 5 సంవత్సరాలుగా రోకలిని నిలబెడుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ఈ మంగళవారం రోజు గ్రహణం సందర్భంగాశగ్రహణ సమయం ఆరంభంలో భక్తి శ్రద్దలతో భక్తురాలు కర్రి చంద్రావతి నిష్ఠతో పసుపు, కుంకుమ తదితర పూజా సామాగ్రితో ప్రత్యేక పూజలు చేసి ఇత్తడి పళ్లెం మధ్యలో రోకలికి ఏ ఆసరా లేకుండా రోకలిని నిటారుగా నిలబెట్టారు. ఇత్తడి పళ్లెంలో నిలబడిన రోకలిని చూడడానికి పరిసర గ్రామాల ప్రజలు భారీగా కిర్లంపూడికి తరలి వచ్చారు. గ్రహణం ప్రారంభం నుండి విడిచే వరకు ఎటువంటి ఆసరా లేకుండా ఇత్తడి పళ్లెంలో రోకలి నిలబడుతుందని మా కాలనీ వాసుల నమ్మకమని కాలనీ చెందిన కట్టమూరు గాయత్రి మీడియాకు తెలిపారు. పళ్లెంలోని రోకలి కింద పడగానే గ్రహణం విడిచినట్టుగా భావించి సంప్రోక్షణ కార్యక్రమాలను ప్రారంభిస్తామని కాలనీ వాసులు తెలిపారు. అలాగే రమణయ్యపేటలో శు భ అనే మరో భక్తురాలు కూడా రోకలిని నిలబెట్టడంతో రమణయ్యపేట అంతా సందడి నెలకొంది.

# అంగన్‌వాడీ కార్యకర్తల అక్రమ అరెస్టులు అమానుషం

**జీతాలు పెంచమని అడిగినందుకు అక్రమ అరెస్టులతో వేదింపులా.? - సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపిన అంగన్వాడీ కార్యకర్తలు మానవహారంగా ఏర్పడి నినాదాలతో హోరెత్తించిన వైనం - అరెస్ట్ చేసిన కార్యకర్తలను విడుదల చేయకపోతే ఉద్యమం ఉధృతి చేస్తామని హెచ్చరిక**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత ప్రభుత్వ హయాంలో 42 రోజుల పాటు నిరసన చేపట్టిన అంగన్వాడీ వర్కర్లకు అండగా నిలబడి తమ ప్రభుత్వం రాగానే అన్ని విధాలుగా సహాయపడతామని హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వ నాయకులు న్యాయమైన కోర్కెలు తీర్చమని నిరసన చేస్తున్న మహిళలను అర్థ రాత్రి బలవంతంగా ఈడ్చుకుని వెళ్లి, నిర్బంధించేలా చేయడం హేయమైన చర్య అని మండల అంగన్వాడీ వర్కర్లు రాయవరం పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా రాయవరం మండల అంగన్వాడీ వర్కర్ల అధ్యక్షులు ఎస్. కృష్ణవేణి, రాయవరం మండలం సిఐటియు కన్వీనర్ డి.ఆదిలక్ష్మి, మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు వేతనాలు పెంచి ఆదుకోవాలని, ఫిబ్రవరి 26,27 తేదీలలో ప్రాజెక్టు ఆఫీసులో వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టి, మార్చి 2 సోమవారం చలో విజయవాడ పేరుతో మహాధర్నా చేపట్టి నిరసన తెలియజేస్తున్న మహిళ అంగన్వాడీ కార్యకర్తలను అర్థరాత్రి సమయంలో అక్రమంగా బంధించి, అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజులపాటు నిరసన తెలియజేసినప్పుడు తమకు సంఘీభావం తెలిపి, కోటమీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్వాడి వర్కర్లను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీలు ఇచ్చి, న్యాయమైన కోర్కెలుగా తమ సమస్యలపై నిరసన తెలియజేస్తే పోలీసులతో అర్ధరాత్రి ఈడ్చుకుంటూ వెళ్ళి, అక్రమ అరెస్టులకు పాల్పడడం దుశ్శాసన పర్వం అవుతుందని, అంగన్వాడీలు అరకొర జీతాలతోనే సాగుతుండగా, ప్రభుత్వం సామాన్యులకు అందించే ఏ సంక్షేమ పథకం తమకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు పెంచి తమకు సాయపడాలని న్యాయమైన కోర్కెలు కోరినందుకు నేరస్తుల మాదిరిగా పోలీసు వారు వ్యవహరించడం ప్రభుత్వ మొండి వైఖరికి నిదర్శనమని, అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేసిన మహిళలను వెంటనే విడుదల చేసి క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన లు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తొలుత తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తూ, నిరసన తెలియజేశారు. ఆశావర్కర్లు సైతం ఈ నిరసనకు సంఘీభావం తెలుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల ఆశా వర్కర్ల యూనియన్ ప్రెసిడెంట్ జి.దుర్గ నిరసన తెలియజేస్తున్న మహిళలపై అర్ధరాత్రి అక్రమంగా దాడి చేయడం హేయమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. ఈ చర్యలపై ప్రభుత్వం వివరణ ఇచ్చి, వెంటనే అంగన్వాడి కార్యకర్తలను విడుదల చేయాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అంగన్వాడి కార్యకర్తలు ఎం. కమల, వై. పద్మ, సి.హెచ్. సత్యవతి, తదితర అంగన్వాడి, ఆశా వర్కర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలు చేశారు.

# పన్నుల వసూలు వేగవంత చేయాలి



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాల్లో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని కాజులూరు మండల డిప్యూటీ ఎంపీడీఓ చక్రపాణిరావు, సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం కాజులూరు మండలం సెలపాక, ఆర్యవటం, గొల్లపాలెం, కాజులూరు, దుగ్గదుర్రు, కుయ్యేరు, కోలంక గ్రామాల్లో పర్యటించి వారు పన్నుల వసూలు కార్యక్రమాల్ని పరిశీలించారు. ఈమేరకు డిప్యూటీ ఎంపీడీఓలు మాట్లాడుతూ ఇంతవరకూ కాజులూరు మండల పరిధిలో సుమారు 73 శాతం పన్నులు వసూలైనట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో పన్నుల వసూళ్లపై సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ పన్నుల చెల్లింపుల ప్రాధాన్యతను వివరించారు. స్థానిక గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి పన్నుల వసూళ్లు ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజలు చెల్లించే ప్రతి రూపాయి గ్రామాభివృద్ధి పనులకే వినియోగించబడుతుందని తెలిపారు. పన్నులు సమయానికి చెల్లించడం ద్వారా గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని, ప్రభుత్వ పథకాల అమలు సులభమవుతుందని చెప్పారు. ఇంకా చెల్లించని వారు వెంటనే బకాయిలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు కే ఈశ్వరి, శివకుమార్, సూర్యప్రకాష్, భాగ్యవతి ,రవికుమార్ , సుబ్బారాయుడు, చంద్రశేఖర్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరిన 76 మంది వైసీపీ కార్యకర్తలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం లయన్స్ క్లబ్ కళ్యాణమండపంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 76 మంది వైసీపీ కార్యకర్తలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక రెండో వార్డు స్టీల్ వెల్ పేటకు చెందిన దోమలపాటి విజయలక్ష్మి రాజశేఖర్, దొమ్మలపాటి లాలి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారందరికీ మంత్రి సుభాష్‌తో పాటు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తెలుగుదేశం పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షేమ పాలన, మంత్రి సుభాష్ చేపడుతున్న నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక సేవల పట్ల ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ప్రజల కోసం పారదర్శకంగా పనిచేస్తున్న నాయకత్వాన్ని బలపర్చడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పార్టీ నాయకులతో మమేకమై, సమన్వయం చేసుకొని తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమిపార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,ఎ ఎం సి చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, కవల నానాజీ, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దంగేటి గౌరీ శంకర్, నియోజవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.



### మీ రక్షణ, సంక్షేమానికి

# కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ముస్లిం మైనారిటీలతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - మెయిన్ రోడ్డులోని చిన్న మసీదులో ఇఫ్తార్ విందుకు హాజరు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముస్లిం మైనారిటీల రక్షణ... సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం కోసం మెయిన్ రోడ్డులోని చిన్న మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై ముస్లిం మైనారిటీ పెద్దలు ఛాన్ బాషా, అల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహమ్మద్ అబ్దుల్లా తదితర ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీల రక్షణకు, సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మసీదులు, ఈద్గాలు, కబర్స్థానల్ల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ముస్లింల అభివృద్ధికి ఎప్పుడూ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. మైనారిటీల అభివృద్ధి, విద్య, ఆర్థిక పురోగతికి ప్రత్యేక పథకాలు అమలు చేయనుందని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. కులమతాలకు అతీతంగా అందరూ సోదరభావంతో కలిసి ఉండాలని పిలుపునిచ్చారు. మానవతా విలువలతో మనిషి మహోన్నతుడిగా మారాలన్నదే ఉపవాసాల అసలు ఉద్దేశ్యం అని, తమ జీవిత సౌదాల్ని సత్యం, న్యాయం, ధర్మం అనే పునాదుల మీద నిర్మింపజేసుకునేందుకు ఉపయోగ పడే సాధనమే ఉపవాస వ్రత పరమార్థమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీపాలు ఘటనకు పాల సంఘానికి సంబంధం లేదు

**పాల వ్యాపారి గణేష్ మా సంఘ సభ్యుడు కాదు - విజయ డెయిరీ ఛైర్మన్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి**
**రాజమండ్రి పాలు పెరుగు వర్తక సంఘం అధ్యక్ష కార్యదర్శులు సూరంపూడి పనసయ్య, లంక రామకృష్ణ**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన కల్తీపాలు సంఘటనకు రాజమండ్రి పాలుపెరుగు వర్తక సంఘానికి సంబంధంలేదని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సూరంపూడి పనసయ్య, లంక రామకృష్ణ స్పష్టం చేశారు. టి.నగర్‌లోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కల్తీపాలు సరఫరా చేసిన కోరుకొండకు చెందిన పాల వ్యాపారి గణేష్ తమ సంఘ సభ్యుడు కాదని తెలిపారు. తమ సంఘం 1946 నుండి ఇప్పటివరకు ఎటువంటి సమస్యలు లేకుండా నిర్విరామంగా నడుస్తోందని చెప్పారు. ప్రస్తుతం తమ సంఘంలో 900 మందికి పైగా సభ్యులు ఉన్నారని వివరించారు. రాజమండ్రి నగరానికి 50 కి.మీ. పైబడి చుట్టుపక్కల గ్రామాల్లోకి వెళ్ళి రైతుల దగ్గర పాలు సేకరించి నాణ్యమైన పాలును రాజమండ్రి ఖాతాదారులకు, వినియోగదారులకు, హోటళ్ళకు, సరఫరా చేస్తున్నామని పనసయ్య, లంక రామకృష్ణ తెలిపారు.పాల వ్యాపారి గణేష్ వాడే ఫ్రీజరులోని పాలు పాడైపోయాయని అతని బంధువు చెప్పినా గణేష్ మూర్ఖంగా ప్రవర్తించాడని,అందుకే అతడిపై అధికారులు చర్యలు తీసుకోవడం సమంజసమేనని,అతనిపై ఇంకా కఠిన చర్యలు తీసుకోవాలని తాము కోరుతున్నామన్నారు.ఈ సంఘటనను ఆసరాగా చేసుకుని విజయ డెయిరీ ఛైర్మన్ పాల వ్యాపారుల నుంచి పాలు కొనవద్దని ప్రజలకు పిలుపుఇవ్వడం సమంజసం కాదని పనసయ్య, రామకృష్ణ హితవు పలికారు.ఒక పాల వ్యాపారి చేసిన తప్పుడుపనివల్ల ఇదే వ్యాపారంలో జీవనోపాధి పొందుతున్న పాల వ్యాపారులు,వేలాది కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తేలిపారు.విజయ డెయిరీ ఛైర్మన్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సూరంపూడి పనసయ్య, లంక రామకృష్ణ డిమాండ్ చేశారు.తమ సుఘ సభ్యులంతా త్వరలో కలెక్టర్ ను కలిసి పాల వర్తకులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతామని పనసయ్య రామకృష్ణ తెలిపారు. విలేకరుల సమావేశంలో సంఘ సభ్యులు వరగోశాల గోవింద్,జగ్గు శ్రీను, కొత్తగడ, నల్లజర్ల నాగు, నంద్యం నాగ వరప్రసాద్, పాల మాంది,గనిశెట్టి రాంబాబు,పూసల వెంకట్రావు, మన్నె నాగేశ్వరరావు,అడ్డగర్ల ఈశ్వర్, పెంటపాటి సుబ్బు,అల్లాడ సత్తిబాబు, ఆరేపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బత్తుల అన్న పుట్టిన రోజంటే చెల్లికి పండగే..

**ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఖండవల్లి లక్ష్మి**





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తనను సొంత చెల్లిలా చూసుకునే రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకుని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్ర తెలంగాణ మహిళా చైర్ పర్సన్,టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ,ఆలిండియా షెడ్యూల్ కులాల రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఖండవల్లి లక్ష్మి ఓ పండుగలా జరిపారు.ఎమ్మెల్యే బత్తులను కలిసిన ఖండవల్లి లక్ష్మి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆయనతో కేక్ కట్ చేయించి నోరు తీపి చేశారు.తనకు సోదరి సమానురాలైన ఖండవల్లి లక్ష్మి అభిమానానికి పులకించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆమెకూ ఎంతో అభిమానంతో స్వీట్ తినిపించి తన ఆప్యాయతను చాటుకున్నారు. అన్నా చెల్లెళ్ళ అనుబంధం, ఆప్యాయతలను చూసిన టీడీపీ, జనసేన, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులంతా వారిని అభినందించారు. ఇటీవల ఖండవల్లి లక్ష్మికి హైదరాబాద్‌లోని ఆదర్శ కళా నిలయం స్వర్ణ నంది అవార్డు అందచేసి సత్కరించిన సమయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆమెను స్వయంగా కలిసి అభినందించారు.తనకు ఈ పురస్కారం లభించినందుకు ఆయన సొంత అన్నయ్య మాదిరి ఎంతగానో సంతోషించారని ఖండవల్లిలక్ష్మి పేర్కొన్నారు. అందుకే తన అన్న పుట్టిన రోజును పురస్కరించుకుని ఆమె కేక్ తీసుకువెళ్ళి కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు.

### నరసన్న కళ్యాణోత్సవంలో

## రెడ్డి పంతులు సత్రం కమిటీ సేవలు అభినందనీయం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాలలో భాగంగా కళ్యాణాన్ని తిలకించడానికి విచ్చేసి భక్తులకు "అన్న వితరణ" కార్యక్రమంలో రెడ్డి పంతులు సత్రం నూతన కమిటీ సభ్యుల సేవలను పలు గ్రామాల భక్తులు జనసేన పార్టీ నాయకులు అభినందనలు చేశారు. మంగళవారం విరియాల వెంకటరెడ్డి పంతులు సత్రాన్ని జనసేన పార్టీ నాయకులు సందర్శించి, అన్న వితరణ కార్యక్రమం పై భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పలు గ్రామాల భక్తులు అన్న వితరణ పై సంతృప్తి వ్యక్తం చేస్తూ, సత్రం అధికారులను, నూతన కమిటీని అభినందించారు. అనంతరం జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సత్రం అధికారులను, నూతన కమిటీ సభ్యులను అభినందిస్తూ, పూలమాలలు వేసి సాల్వల తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్రం నూతన కమిటీ అధ్యక్షులు మట్టా నాగేశ్వరరావు, పసుపులేటి శివ, తాటికొండ చిన్నోడు, ధనాలకోట లక్ష్మి శాసనసభ్యులు బత్తులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొని,వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో సత్రం ఈవో లక్ష్మి కుమార్, సూరిబాబు, అడ్డాల శ్రీను, అడపా శ్రీనివాస్, కర్రి లక్ష్మీసరోజ గణేష్, బదిరెడ్డి దొర, ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ, జాజుల గణేష్, కొచ్చర్ల బాబి, తాటికొండ బుజ్జి, కోర్పు రామకృష్ణ , పలు గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోరుకొండలో ఘనంగా బత్తుల జన్మదిన వేడుకలు




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ జన్మదిన వేడుకలను కోరుకొండలోని పలు చోట్ల జనసేన పార్టీ నాయకులు జన సైనికులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయం, మిరియాల వెంకట రెడ్డి పంతులు సత్రంలలో బత్తుల జన్మదిన వేడుకలు పురస్కరించుకొని జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, అభిమానులు భారీ కేకును కట్ చేసి, బత్తుల నాయకత్వం వర్ధిల్లాలి, బత్తుల జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ ఒకరినొకరు కేకులు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమంతో పాటు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు శాసనసభ్యులు బత్తుల పార్టీ వ్యవహారాల్లో అన్ని విధాల బాసటగా నిలుస్తున్నారని, భవిష్యత్తులో పవన్ కళ్యాణ్ బత్తులకు మరింత సంచిత స్థానాన్ని కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అడ్డాల శ్రీను, బదిరెడ్డి దొర,యర్రంశెట్టి పోలరావు, దుర్గాప్రసాద్, మట్టా నాగేశ్వరరావు, ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ, కర్రి లక్ష్మీసరోజ గణేష్, జాజుల గణేష్ పలువురు జనసేన పార్టీ నాయకులు, జన సైనికులు, వీర మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### నేటి ప్రజా నాయకులందరూ

# బాలయోగిని ఆదర్శం తీసుకోవాలి

**అంబేద్కర్ ఆశయసాధన కోసం బాలయోగి నిరంతరం కృషి - చిన్నస్థాయి నుండి లోక్‌సభ స్పీకర్‌గా బాలయోగి ఎదిగారు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తొలి దళిత లోక్ సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి 24వ వర్ధంతిని మంగళవారం ఉదయం స్థానిక దేవిచౌక్‌లో గల రత్నం ఆర్గనైజేషన్ నందు తొలి దళిత లోక్ సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి వర్ధంతి నివాళుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా దళిత గిరిజన సంఘాల చైర్మన్ కోరుకొండ చిరంజీవి మాట్లాడుతూ, అతి సామాన్యమైన స్థాయి నుండి భారత దేశంలోనే అత్యున్నతమైన లోక్‌సభ స్పీకర్ గా పదవి చేపట్టడం ఆయనపై ఉన్నటువంటి నమ్మకాన్ని ఆ పదవిలోనికి తీసుకెళ్లడం జరిగింది ఆయన పేదరికంలో జన్మించిన ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యాభ్యాసాన్ని ప్రారంభించి న్యాయవిద్యను తదితర ఉన్నత విద్యలను అభ్యసించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయసాధన కోసం నిరంతరం కృషి చేసి దళిత గిరిజనులకే కాక ప్రజలందరికీ కూడా తన సేవలను అందించినటువంటి నిస్వార్థపరుడు కనుక నేటి ప్రజా నాయకులందరూ ఆయన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు తాళ్లూరు బాబు రాజేంద్రప్రసాద్, జిల్లా ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు కోరుకొండ చిరంజీవి, రత్నం ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దారా యేసురత్నం,ప్రముఖ దళిత నాయకులు సోమాబత్తుల విజయ్ కుమార్, జంగం సుబ్బారావు,ముంగండ సుబ్బారావు,పుచ్చకాయల అశోక్ కుమార్,ఉసురుమర్తి రామారావు,అర్ధాల కుమార్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర ఆధ్వర్యంలో బాలయోగికి ఘన నివాళి

**- వృద్ధులకు కాస్మోటిక్ దుస్తులు నగదు బహూకరణ**
**- బాలయోగి విశిష్ట సేవలను గుర్తించి జాతీయస్థాయి అవార్డును అందించాలి**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత లోక్సభాపతి జీఎంసీ బాలయోగి వర్ధంతి వేడుకలను స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. తొలిత స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు నేతృత్వంలో అనూప్ కుమార్ జైన్ ,కాశి, బాలాజీ, వృద్ధులతో కలిపి జీఎంసి బాలయోగి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుమారు 100 మంది వృద్ధులకు దుస్తులు కాస్మోటిక్ కిట్స్ 100 రూపాయలు నగదు చొప్పున అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా కి ముఖ్యంగా కోనసీమకి బాలయోగి చేసిన సేవలు అమూల్యమన్నారు. ఎవరు సహాయం కోరి వచ్చినా వారికి సేవలు అందించడంలో బాలయోగి ముందుంటూ అందరి మన్ననలు పొందారన్నారు .జిల్లా పరిషత్ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే, విద్యా శాఖ మంత్రిగా, రెండుసార్లు లోక్సభ స్పీకర్గా బాలయోగి దేశానికి విశేష సేవలు అందించారని రాంబాబు కొనియాడారు. బాలయోగి చేసిన సేవలకు గుర్తుగా కేంద్ర ప్రభుత్వం విశిష్ట అవార్డుతో గౌరవించాలని రాంబాబు కోరారు.ఈ సందర్భంగా బాలయోగితో ఉన్న స్నేహాన్ని రాంబాబు గుర్తు చేసుకున్నారు. బాలయోగి సూచనల మేరకే తాను స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించి నేటికీ కొనసాగిస్తున్నానని రాంబాబు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజర్ ఎద్దు హరికృష్ణ సింధు దివ్య, మీరా కుమారి, రాంజీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడిగా

# షేక్ బాజ్జి నియామకం

**దివ్యాంగుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయాలి - సమితి జాతీయ అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత కొన్ని సంవత్సరాలుగా దివ్యాంగుల హక్కుల కొరకు పోరాటం చేస్తున్న షేక్ బాజ్జిని దివ్యాంగుల హక్కుల సాధన సమితి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులుగాప్రకటిస్తున్నట్లు సమితి జాతీయ అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ తెలిపారు. ఇకపై షేక్ బాజ్జి దివ్యాంగుల హక్కుల కోసం నిష్పక్షపాతముగా పనిచేయాలని వారి అభివృద్ధి, సంక్షేమ కోసం కృషి చేయాలని కోరుకుంటూ బందెల కిరణ్ రాజ్ ఆయనకు శుభాకాంక్షలు తెలియ చేశారు.ఈ కార్యక్రమములో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉల్లం రవి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ నాయకులు పాకెళ్ళ శేఖర్, వైఎస్ఆర్ సీపీ నాయకులు వల్లూరి రాజేష్, గుంటూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూషణం తదితరులు పాల్గొన్నారు.

# దివంగత బుంగ రామారావు సేవలు చిరస్మరణీయం

**సంతాపం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘ నాయకుడు ఉందుర్తి సుబ్బారావు**



**బిక్కవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుండి ఉద్యమంలో క్రియాశీలకు భూమిక పోషించి, డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ పేరిట యువజన సంఘాన్ని స్థాపించి దళిత వర్గంలో ప్రతిభగలిగిన విద్యార్థులను, ఉద్యోగులను సత్కరిస్తూ గత 35 సంవత్సరాలుగా అనేక సమాజం యొక్క కార్యక్రమాలు చేపడుతున్నటువంటి మంచి మనిషి మాకు అత్యంత ఆప్తుడు మదర్ తెరిసా సేవా సమితి శాశ్వత ఆహ్వానితులు బలబద్రపురం గ్రామ సర్పంచ్ బుంగ రామారావు కార్డియాక్ అరెస్ట్ తో మరణించడం చాలా బాధాకరమని ఈ సందర్భంగా బలబద్రపురం గ్రామంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఏపీ ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, మదర్ తెరిసా సేవాసమితి వ్యవస్థాపకుడు ఉందుర్తి సుబ్బారావు మాస్టర్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు మదర్ తెరిసా సేవా సంస్థ ప్రతినిధులు బలబద్రపురం హాజరై బుంగరామారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉందుర్తి సుబ్బారావు మాట్లాడుతూ బుంగ రామారావు సేవలు భావితరాలకు నెలువెత్తు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని, మూడున్నర దశాబ్దాల రామారావు సేవ జీవితాన్ని కొనియాడుతూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ యువజన నాయకుడు అరుణ్ కుమార్ మాదిగ, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉందుర్తి బుల్లి వీరయ్య మాదిగ, అనపర్తి మండల ఏపీ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ గంగరాజు మాదిగ, ఏపీ ఎమ్మార్పీఎస్ అనపర్తి నియోజకవర్గ కన్వీనర్ పెనుమాకే ఏసు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

సినీ వాయిస్ CINEMA

# ఇదెక్కడి వెబ్ సిరీస్‌రా అయ్యా..!

## ధైర్యం ఉన్నవాళ్లే చూడాల్సిన సిరీస్



ఓటీటీలో సినిమాలకు కొదువే లేదు.. కరోనా పుణ్యమా అని ఎప్పుడైంటే ఓటీటీలో మొదలయ్యాయో అప్పటి నుంచి ఆడియన్స్ కు డబుల్ ఎంటర్టైన్మెంట్ దొరుకుతుంది. ప్రేక్షకులు థియేటర్స్ తో పాటు ఓటీటీల్లోనూ సినిమాలు చూడటాన్ని ఆసక్తి చూపిస్తున్నారు. కాగా ఇప్పుడు ఓటీటీలో ఓ హారర్ సిరీస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఓటీటీలో హారర్ థ్రిల్లర్ సినిమాలకు ఉండే ఆదరణే వేరు. ఈ జానర్లకు చెందిన సినిమాలు ఇతర భాషల్లో ఉన్నా సబ్ టైటిల్స్ తో చూసి ఆనందిస్తుంటారు ఓటీటీ ఆడియెన్స్. ప్రస్తుతం ఓటీటీ ప్లాట్ ఫామ్స్ లో హారర్, సస్పెన్స్ థ్రిల్లర్, మిస్టరీ చిత్రాలకు మంచి రెస్పాన్స్ వస్తుంది. ఇటీవల అడియన్స్ కూడా ఇదే తరహా కంటెంట్ చూసేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. అందుకే అటు సినీ ప్రియులను ఆకట్టుకునేందుకు ఎక్కువగా హారర్ కామెడీ చిత్రాలను తీసుకువస్తున్నారు మేకర్స్. ఇతర భాషలలో సూపర్ హిట్ అయిన చిత్రాలను కూడా తెలుగులోకి డబ్ చేస్తున్నారు. ఇక ఇప్పుడు హారర్ ఓ వెబ్ సిరీస్ ఓటీటీని వణికించేస్తోంది. ఓ భాషలో రిలీజ్ అయిన వెబ్ సిరీస్ ను టాలీవుడ్, కోలీవుడ్ అనే భేదాలు లేకుండా అన్ని భాషలకు చెందిన అడియన్స్ చూస్తున్నారు. ఇప్పుడు ఆ సిరీస్ ఓటీటీలో కాకుండా యూట్యూబ్ లో ఫ్రీగా చూడొచ్చు. అదే కరువనమ్. తమిళంలో రూపొందించిన హారర్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ ఇప్పుడు నేరుగా యూట్యూబ్ లో రిలీజ్ అయ్యింది. మొత్తం మూడు ఎపిసోడ్స్ ఉన్న సిరీస్ ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. ఇప్పుడు యూట్యూబ్ లో ఈ వెబ్ సిరీస్ ట్రెండింగ్ లో ఉంది. ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ తో ఈ సిరీస్ అందుబాటులోకి తీసుకువచ్చారు మేకర్స్. ఇందులో ఉదయ సుందరి, జయ శ్రీ విజయన్, విఘ్నేష్ వరదరాజన్, వీరరాఘవన్ ప్రధాన పాత్రలు పోషించారు. కుమరన్ సుందరన్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఆద్యతం ఊహించని ట్విస్టులు.. వణుకుపుట్టించే సీన్లతో ఆకట్టుకుంటుంది. కథ విషయానికి వస్తే.. మీరా, షాలిని అనే ఇద్దరు అనాథలు ఓ ఆశ్రమంలో పెరుగుతుంటారు. వారిద్దరిని ఓ గొప్పింటి మహిళ దత్తత తీసుకుంటుంది. తల్లి మరణించడంతో ఆమె ఇంట్లో కొన్నాళ్లపాటు గడపాల్సి వస్తుంది. ఆ ఇంట్లో వారికి ఎలాంటి అనూహ్య పరిణామాలు ఎదురయ్యాయి.? అసలు వారిద్దరి తల్లి ఎలా చనిపోయింది.. అన్నదే అసలు కథ. ఈ సిరీస్ ఇంట్రెస్టింగ్ ట్విస్టులు, వణుకించే సీన్లతో ఆకట్టుకుంటుందని ఇప్పటికే రివ్యూస్ వచ్చాయి. ఈ సిరీస్ మొత్తం ఎనిమిది ఎపిసోడ్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ హారర వెబ్ సిరీస్ ను అస్సలు మిస్ అవ్వకండి. ప్రతి సీన్ సీట్ ఎడ్జ్ లో కూర్చోబెడుతుంది.

# ఏం సాంగ్.. ఏం డాన్స్ భయ్యా..!

## మైండ్ లోనుంచి పోవడం లేదు..!! దుమ్ములేపుతున్న యూట్యూబ్ సాంగ్



ప్రస్తుతం సోషల్ మీడియాలో తెలంగాణ పల్లె పాటలకు వచ్చే రెస్పాన్స్ గురించి చెప్పక్కర్లేదు. కొన్నాళ్లుగా మిలియన్ వ్యూస్ అందుకుంటూ నెట్టింట రచ్చ చేస్తున్నాయి. పాటలోని పదాలు అర్థం కాకపోయినా నెట్టింట తెలంగాణ ఫోక్ సాంగ్స్ దుమ్మురేపుతున్నాయి. విడుదలైన గంటల్లోనే మిలియన్ వ్యూస్ అందుకుంటున్నాయి. సినిమా పాటలతో పాటు జానపద గీతాలు కూడా రీసెంట్ డేస్ లో బాగా పాపులర్ అవుతున్నాయి. నిజం చెప్పాలంటే సినిమా సాంగ్స్ కంటే ఎక్కువ పాపులర్ అవుతున్నాయి ఫోక్ సాంగ్స్. దాంతో పాపులర్ అయినా సాంగ్స్ ను సినిమాల్లోనూ వాడేసుకుంటున్నారు. ఈ ఫోక్ సాంగ్స్ రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఇప్పుడు దేశ విదేశాల్లోనూ ప్రజలను ఉర్రుతలూగిస్తున్నాయి జానపదగీతాలు. అలాగే యూట్యూబ్ లో మిలియన్స్ కొద్దీ వ్యూస్ సొంతం చేసుకుంటూ దూసుకుపోతున్నాయి. ఇక ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న సాంగ్ కూడా యూట్యూబ్ ను షేక్ చేస్తుంది. ఎక్కడ చూసిన ఆ సాంగ్ వినిపిస్తూనే ఉంది.. ఫోక్ సాంగ్ అంటే టక్కున గుర్తొచ్చే సాంగ్ ఇది. ఆ సాంగ్ ఏంటంటే.. యూట్యూబ్ ఓపెన్ చేసి బెస్ట్ ఫోక్ సాంగ్స్ అని టైప్ చేస్తే ముందుగా వచ్చే సాంగ్ ఇదే.. అది “బావల్ల నా బావల్ల” సాంగ్. ఈ సాంగ్ వచ్చి దాదాపు ఆరేళ్ళు అవుతుంది. ఇప్పటికీ ఈ సాంగ్ ఓ సెన్సేషన్ అనే చెప్పాలి. ఈ సాంగ్ ను తిరుపతి మెట్ల రచించారు. సింగర్ శిరీష ఈ సాంగ్ ను ఆలపించింది. ఈ సాంగ్ దుమ్ములేపిందనే చెప్పాలి.. యూట్యూబ్ లో 121 మిలియన్ కు పైగా వ్యూస్ సొంతం చేసుకుంది ఈ సాంగ్. ఇప్పటికే ఈ పాటకు చాలా మంది డాన్స్ చేసి మెప్పించారు. ఫంక్షన్స్ లో, ఈవెంట్స్ లో ఈపాట తెగ వినిపిస్తుంది. ఓ అమ్మాయి తన ప్రియుడి కోసం తపన పడుతూ ఉన్న లిరిక్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సోషల్ మీడియాలో, ఇన్ స్టా గ్రామ్ రీల్స్ లో ఈ పాట సెన్సేషన్ అయ్యింది. ఈ పాట పై మీరూ ఓ లుక్కేయండి.

క్రీడా వాయిస్

# ఇక వార్ వన్‌సైడేరోయ్.!

## సెమీస్‌కు ముందే టీమిండియాకు 5 గుడ్‌న్యూస్‌లు..



టీ20 ప్రపంచకప్ 2026 ఉత్కంఠభరిత దశకు చేరుకుంది. వెస్టిండీస్‌పై అద్భుత విజయం సాధించి టీమిండియా సెమీఫైనల్‌లోకి అడుగు పెట్టింది. మార్చి 5వ తేదీన ముంబైలోని చారిత్రాత్మక వాంఖడే స్టేడియంలో భారత్ తన సెమీఫైనల్ పోరును ఇంగ్లాండ్‌తో తలపడనుంది. వరుసగా మూడోసారి ఈ రెండు జట్లు సెమీఫైనల్‌లో తలపడడం విశేషం. 2022లో ఇంగ్లాండ్ భారత్‌ను ఓడించి కప్ గెలుచుకోగా, 2024లో భారత్ ఇంగ్లాండ్‌ను ఓడించి కప్ కైవసం చేసుకుంది. ఇప్పుడు 2026లో కూడా ఈ రెండు జట్లు తలపడుతుండడం ప్రపంచకప్ చరిత్రలో ఒకే ప్రత్యర్థితో వరుసగా మూడు సెమీఫైనల్స్ ఆడడం అరుదైన అంశంగా నిలిచింది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు టీమిండియాకు ఐదు గుడ్ న్యూస్‌లు ఉన్నాయి. మొదటిది, స్వదేశంలో టీ20 ప్రపంచకప్ గెలవని రికార్డును బద్దలు కొట్టడానికి, అలాగే వరుసగా రెండు టైటిల్స్ సాధించడానికి టీమిండియా రెండు అడుగుల దూరంలో ఉంది. ఫైనల్‌కు చేరి గెలిస్తే, ఈ అరుదైన ఘనతను సాధించిన జట్టుగా టీమిండియా నిలుస్తుంది. రెండోది, కొంతకాలంగా ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడిన సంజూ శాంసన్, వెస్టిండీస్‌పై 97 పరుగులు చేసి కీలక సమయంలో ఫామ్ అందుకున్నాడు. ఇది జట్టుకు గొప్ప శుభ పరిణామం. మూడోది, బ్యాటింగ్ ఆర్డర్‌లో తిలక్ వర్మ ఐదో స్థానంలో వచ్చి అద్భుతంగా రాణిస్తున్నాడు. గతంలో మూడో స్థానంలో ఆడిన తిలక్, ఐదవ స్థానంలో రావడంతో జట్టుకు బాగా కలిసి వచ్చింది. జింబాబ్వేతో మ్యాచ్‌లో పవర్ హిట్టింగ్‌తో 44 పరుగులు చేయగా, వెస్టిండీస్‌పై కీలక మ్యాచ్‌లో స్కోర్‌బోర్డు నెమ్మదిగా ఉన్న సమయంలో క్రీజులోకి వచ్చి ఒక్కసారిగా పరుగులు వేగం పెంచాడు. మధ్య ఓవర్లలో టీమిండియాకు ఇది అద్భుతంగా సెట్ అయింది. నాలుగోది, వాంఖడే స్టేడియంలో ఇంగ్లాండ్‌పై గతంలో టీమిండియా భారీ విజయాన్ని నమోదు చేసింది. ఐదోది, ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు లేకపోవడం, ఒకవేళ వర్షం వచ్చినా రిజర్వ్ డే ఉండటం టీమిండియాకు కలిసి వచ్చే అంశాలు. ఈ సానుకూల అంశాలు ఇంగ్లాండ్‌పై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకోవడానికి భారత జట్టుకు తోడ్పడనున్నాయి.

### జరిమానాలు వేసి

# డబ్బులు వసూలు చేస్తే సరిపోదు..

## సిస్టమ్ మార్చండి.. బోర్డుపై అఫ్రిది ఫైర్



టీ20 వరల్డ్ కప్ 2026లో పాకిస్థాన్ జట్టు ప్రస్థానం అత్యంత దారుణంగా ముగిసింది. కనీసం సెమీఫైనల్ చేరుతుందనుకున్న ఆ జట్టు సూపర్ 8 దశలోనే ఇంటిముఖం పట్టడంతో ఆ దేశంలో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వైఫల్యానికి బాధ్యులను చేస్తూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆటగాళ్లపై కఠిన చర్యలకు దిగినట్లు సమాచారం. జట్టులోని ప్రతి ఆటగాడికి రూ.50 లక్షల జరిమానా విధించాలని పీసీబీ నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. బోర్డు నుంచి ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ వార్త పాక్ క్రికెట్ వర్గాల్లో పెను దుమారాన్ని రేపుతోంది. ఈ కఠిన నిర్ణయానికి ప్రధాన కారణం భారత్ చేతిలో ఎదురైన ఘోర పరాజయమేనని తెలుస్తోంది. గ్రూప్ దశలో అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా వంటి చిన్న జట్లపై గెలిచినప్పటికీ, టీమిండియా చేతిలో ఓడిపోవడం పాక్ బోర్డుకు మింగుడుపడలేదు. ఇక సూపర్ 8లో న్యూజిలాండ్‌తో మ్యాచ్ వర్షం వల్ల రద్దు కావడం, ఇంగ్లాండ్‌తో ఓటమి, శ్రీలంకపై నామమాత్రపు విజయం సాధించడంతో పాకిస్థాన్ సెమీస్ రేసు నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. సల్మాన్ అలీ ఆగా సారథ్యంలో బరిలోకి దిగిన పాక్ జట్టు ఏ దశలోనూ పటిష్టమైన జట్టుగా కనిపించకపోవడం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. పీసీబీ తీసుకున్న జరిమానా నిర్ణయంపై పాక్ మాజీ దిగ్గజం షాహిద్ అఫ్రిది నిప్పులు చెరిగారు. జరిమానాలు వేయడం వల్ల ఆట మెరుగుపడదని, ఇది చాలా సంకుచితమైన ఆలోచన అని ఆయన మండిపడ్డారు. కేవలం డబ్బులు వసూలు చేస్తే సరిపోదని, అసలు సమస్య క్రికెట్ వ్యవస్థలో ఉందని అఫ్రిది విమర్శించారు. వరుసగా విఫలమవుతున్న ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించి, వారిని మళ్ళీ డొమెస్టిక్ క్రికెట్ ఆడి ఫామ్ నిరూపించుకోమని చెప్పాలని ఆయన సూచించారు. జట్టులో కొత్త రక్తాన్ని నింపాల్సిన సమయం వచ్చిందని, జరిమానాలు వేయడం వల్ల ఆటగాళ్లలో భయం పెరుగుతుందే తప్ప టాలెంట్ బయటకు రాదని అఫ్రిది ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియాలో కూడా ఈ విషయంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కొందరు బోర్డు నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం అఫ్రిది మాటల్లో నిజముందని అభిప్రాయపడుతున్నారు. ఆటగాళ్ల జీతాల నుంచి కోత విధించడం కంటే, మేనేజ్మెంట్ లో మార్పులు చేయాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. మొత్తానికి టీ20 వరల్డ్ కప్ ఓటమి పాకిస్థాన్ క్రికెట్‌ను కోలుకోలేని దెబ్బ తీసింది. మరి రాబోయే రోజుల్లో బోర్డు ఎలాంటి ప్రక్షాళన చేపడుతుందో చూడాలి.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com